ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు


జిల్లా వార్తలు

5

శనివారం 5 ఏప్రిల్ 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 35.0 కనిష్ఠం: 25.0

జల్లేరు జలాశయం



తాడు సాయంతో శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం గేటుకు రిపేరు చేస్తున్న ఎలక్ట్రీషియన్

• జలాశయానికి మహర్దశ..

బుట్టాయగూడెం : దొరమామిడి సమీపంలోని శ్రీ గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం గేట్ల మరమ్మతు పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. దశాబ్దాలుగా ఈ గేట్లు మరమ్మతులకు గురైనా పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో వీటిచుట్టూ వున్న రబ్బరు స్టాపర్స్ పాడై నీరు వృథాగా పోతుండేది. వీటికి మరమ్మతులు చేయించి వృథాను అరికట్టాలని చర్యలు తీసుకోవాలని రైతులు పలుమార్లు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరినా స్పందన లేదు. 1978లో నిర్మించిన జలాశయానికి ఇంత వరకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. వీటికి నిధులు కావాలంటూ ఇరిగేషన్ అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపించినా.. వచ్చేవి కాదు. టీడీపీ అధికారంలోకి వచ్చాక గేట్ల మరమ్మతులకు విపత్తుల నిర్వహణ నిధులు రూ.8.42 లక్షలు విడుదలచేసింది. దీంతో ఇరిగేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన పాడైన వాటిని తొలగించి నూతన సామగ్రిని అమరుస్తున్నారు. గేట్ల చుట్టూ రబ్బర్ స్టాపర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల జలాశయంలో సాగు నీటిని నిలుపుదల చేసే అవకాశం ఉంటుందని ఏఈ సురేష్ తెలిపారు. గేట్లు తుప్పు పట్టకుండా కలర్స్ కోసం రూ.27 లక్షలతో ప్రతిపాదనలు పంపామని నిధులు విడుదలైన వెంటనే పనులు చేస్తామన్నారు.

నిధుల కొరత..

నిర్లక్ష్యం!

మరమ్మతులకు నోచుకోని జలాశయాల గేట్లు

- ఏటా రైతులకు దినదినగండమే
- ఈ సీజన్‌లో పనులు చేయకుంటే భవిష్యత్తులో పెను విపత్తే..
- తక్షణం కదలాలి.. పనులు చేయాలి

ఆంధ్రజ్యోతి విజిట్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జలాశయాలు ఉన్నచోట్ల గేట్లు మరమ్మతులతోపాటు గట్లు భద్రతకు తీసుకోవాల్సిన చర్యలకు ఇది అనువైన సమయం. గడిచిన ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం గేట్ల మరమ్మతులను గాలికొదిలేసింది. బీటలు వారిన గట్ల పటిష్టతను నామమాత్రపు చర్యలతో సరిపెట్టింది. ప్రజల భద్రతను, రైతుల శ్రేయస్సును పట్టించుకోలేదు. ఇప్పుడు సరైన నిర్ణయాలు, చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. వేసవిలోనే తమ్మిలేరు, ఎర్రకాలువ, జల్లేరు, కొవ్వాడ వంటి రిజర్వాయర్ల గేట్ల మరమ్మతులు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. వేసవి తర్వాత ఈ జలాశయాల గేట్ల నుంచి లీకేజీ అత్యధికంగా ఉంటుంది. రిజర్వాయర్లకు చేరే నీరు ఎగువ ప్రాంతాల నుంచి అత్యధికంగా వచ్చి పడుతోంది. అప్పటికప్పుడు స్వల్ప మరమ్మతులు చేయడానికి ఆస్కారమే లేదు. ఈ కారణంగానే ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం స్పందించాలన్నదే రైతుల ఆకాంక్ష. తమ్మిలేరు జలాశయ పరిరక్షణకు జపాన్ నిధుల సాయంతో మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎర్రకాలువ జలాశయం పరిస్థితి ఇలాంటిదే. గేట్ల మరమ్మతు, మెయింటెనెన్స్ నిమిత్తం కనీసం నిధులు కేటాయించకపోవడం అలక్ష్యానికి సంకేతం. తాజాగా ఇప్పుడూ తగిన నిధులు కేటాయించలేదు. జల్లేరు జలాశయం గేట్ల మరమ్మతులకు, గేట్ల నిర్వహణ నిమిత్తం కొంత నిధులు కేటాయించారు. పనులైతే ఊపందుకోలేదు. కొవ్వాడ రిజర్వాయరు పరిస్థితి అంతంతే. కొండ వాగుల నీటిని ఇక్కడ భద్రపరిచి రైతుల అవసరాలకు వినియోగించే వారు. అలాంటి రిజర్వాయరుకు నిర్లక్ష్యం నీడ అలముకుంది.

ఎర్రకాలువ జలాశయం



జంగారెడ్డిగూడెం : వేల ఎకరాలకు సాగు నీరందించే ఎర్రకాలువ జలాశయాన్ని పట్టించుకునే నాథులే కరువయ్యారు. వరద ప్రభావం అధికంగా ఉన్నప్పుడు వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తారు. ఏటా జూన్‌లో జలాశయం నాలుగు గేట్లను ఇరిగేషన్ సిబ్బంది పరిశీలించి గేట్లకు గ్రీజు పెడతారు. నాలుగేళ్ల నుంచి

నాలుగేళ్ల నుంచి పైసా రాలేదు

జలాశయ గేట్ల మెయింటెనెన్స్ నిమిత్తం ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి లేదు. ఇక్కడ పనిచేసే సిబ్బంది తమ సొంత డబ్బు రూ.40 వేలతో గ్రీజు కొని గేట్లకు పెడుతున్నారు. జనరేటర్‌కు అవసరమయ్యే డీజిల్ ఖర్చును సొంతంగానే భరిస్తున్నారు. 2019 కు ముందు టీడీపీ ప్రభుత్వంలో ప్రాజెక్టు మెయింటెనెన్స్ కోసం ఏటా రూ.15 నుంచి రూ.20 లక్షలు విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక చిల్లిగవ్వ విదల్చలేదు. ఫలితంగా 2018లో వరద ఉధృతి పెరిగినప్పుడు గేట్లు స్టక్ అవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. నాలుగు గేట్లకు 32 బేరింగులు తుప్పు పట్టి తిరగడంలేదు. వాటి స్థానంలో కొత్తవి వేయాల్సిఉండగా గతేడాది బడ్జెట్ లేక కేవలం ఒక్క బేరింగ్ మాత్రమే వేశారు. బేరింగులు తుప్పు పట్టి స్టక్ అవడం వల్ల గేట్లను ఎత్తడానికి, దింపడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తమ్మిలేరు జలాశయం



లీకేజీ అవుతున్న తమ్మిలేరు రిజర్వాయరు వరద గేట్లు

• వరద గేట్లకు మరమ్మతులేవీ ?

చింతలపూడి: ఏలూరు నగరాన్ని ముంపు బారి నుంచి కాపాడుకోవడానికి నాగిరెడ్డిగూడెం వద్ద నిర్మించిన తమ్మిలేరు రిజర్వాయరు వరద గేట్లు పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. మెయింటెనెన్స్ నిధులు లేక షట్టర్లకు గ్రీజు పెట్టాలన్నా పర్యవేక్షణ అధికారులే సొంత సొమ్ముతో పెట్టాల్సి వస్తోంది. ఈ రిజర్వాయర్ నుంచి మూడు వరద గేట్ల ద్వారా అదనపు నీరు దిగువకు వదులుతారు. షట్టర్ల వద్ద లీకేజీలు ఉన్నాయి. గేట్లు పూర్తిగా మూసినా నీరు వృథాగా పోతోంది. ఈ రిజర్వాయరు రెండు బేసిన్‌లు కలిగి ఉంటుంది. ఒకటి తమ్మిలేరు బేసిన్, రెండు గోనెల వాగు బేసిన్. వీటిని అనుసంధానం చేస్తూ లింక్ చానల్ ఏర్పాటు చేశారు. ఈ లింక్ చానల్‌పై మంకొల్లు నుంచి కోటపాడు వెళ్లే ప్రజలకు వంతెన నిర్మించారు. ఈ వంతెన రెయిలింగ్ దెబ్బతింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో తమ్మిలేరు ఏలూరు జిల్లా పరిధిలోకి వచ్చింది. కుడి, ఎడమ, మధ్య కాలువల ద్వారా తొమ్మిది వేల ఎకరాలు సాగవుతోంది. రాబోయే వర్షాకాలం సీజన్ నాటికి షట్టర్లకు మరమ్మతులు చేయకపోతే ఇబ్బందులే. లీకేజీల ద్వారా నీరు వృథా అవుతుంది. ఈ లీకేజీలు అరికట్టాలంటే షట్టర్లకు రబ్బర్ సీల్ ఏర్పాటు చేయాలి. షట్టర్లు తుప్పు పట్టి ఉన్నాయి. ప్రస్తుతం జైకా నిధులు రూ.16 కోట్లతో కాలువల మరమ్మతులు జరుగుతున్నాయి. గేట్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. శివపురం వద్ద కాజ్‌వే ఎత్తు లేపాలని ఇరువైపుల గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వరదల సమయంలో పల్లపు ప్రాంతం వైపు గండిపడి రాకపోకలు స్తంభిస్తున్నాయి.



వేంపాడు మేజర్‌లో నిర్మించిన రిటైనింగ్‌వాల్ (ఫైల్)

రూ.44.60 కోట్ల అదనపు సాయానికి ప్రతిపాదనలు

- వేంపాడు పనులపై విచారణకు సీఎం ఆదేశం

చాట్రాయి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకం పరిధిలో ప్యాకేజీ-4 ద్వారా వేంపాడు మేజర్ కాలువలో రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి రూ.44.60 కోట్లు అదనపు నిధులకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై చింతలపూడి ఎత్తిపోతల పథకం ఎస్ఈ శ్రీరామకృష్ణను వివరణ కోరగా ఇది గతంలోనే జరిగిన పని అని, బిల్లులు చెల్లింపునకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.

కొవ్వాడ జలాశయం



• రైతులకు సమృద్ధిగా నీరు

పోలవరం : కొవ్వాడ రిజర్వాయర్.. ఏటా కురిసిన వర్షాలకు జలకళతో ఉట్టిపడుతుంది. మెట్ట ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసే వర్షాలకు వాగులు, వంకలు పొంగి ఈ రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుంది. వీటిని నిల్వ చేసి గోపాలపురం, పోలవరం మండలాల్లోని రెండు వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వున్న మొక్కజొన్న, అపరాలు, వరి పంటలకు నీటిని అందిస్తున్నారు. తాజాగా రైతుల అభ్యర్థన మేరకు కుడి కాలువకు నాలుగు, ఎడమ కాలువకు రెండు క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో ఈ ఏడాది రైతులకు రబీ గట్టెక్కే పరిస్థితులు కనిపించాయి. గతేడాది ఇదే సీజన్‌లో 83.50 మీటర్లు నమోదైన నీటిమట్టం ప్రస్తుతం 80.75 మీటర్లుగా వుంది. గతేడాది కుడి కాలువకు మాత్రమే ఆరు క్యూసెక్కుల నీటిని అందించారు. ఎడమ కాలువకు నీటి అవసరం లేకపోయింది. రైతుల అభ్యర్థన మేరకు అవసరమైన నీటిని అందిస్తున్నామని, మేలో గేట్లకు గ్రీజింగ్ వర్క్, మరమ్మతులు చేస్తామని ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్ ఏఈ రాహుల్ భాస్కర్ తెలిపారు.



ఏలూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం నూతన స్లాట్ బుకింగ్ ద్వారా తొలి రిజిస్ట్రేషన్ చేసిన ఏలూరుకు చెందిన కూరపాటి రాశికి పత్రాలు అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

స్లాట్ బుకింగ్ సక్సెస్

- సమయం కలిసొచ్చిందంటూ కక్షిదారుల ఆనందం
- తొలిరోజు సాఫీగా15కు పైగా రిజిస్ట్రేషన్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇక రోజువారి రిజిస్ట్రేషన్లలో ముందస్తు స్లాట్ పద్ధతి శుక్రవారం నుంచి అమలులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో తొలి స్లాట్ రిజిస్ట్రేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కార్యాలయాల్లో ఎవరైనా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలంటే ముందస్తుగా నిర్దేశించిన వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. దీని ప్రకారమే తేదీ, సమయం సంబంధీకులకు అందుతుంది. ఇంతకు ముందున్న పాత పద్ధతికి స్వస్తి చెప్పి స్లాట్ బుకింగ్ పద్ధతిని తెలుగుదేశం ప్రభుత్వం తెరముందుకు తెచ్చింది. తొలి రోజైన శుక్రవారం ఏలూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో 15 మందికి పైగా ఈ పద్ధతిలో రిజిస్ట్రేషన్లకు దిగారు. తొలిగా ఏలూరుకు చెందిన కూరపాటి రాశి రిజిస్ట్రేషన్ చేయగా రిజిస్ట్రేషన్ పత్రాలను జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు అందించారు. 'నిజంగా.. రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన కొత్త పద్ధతి చాలా బాగుంది. ముందస్తు సమాచారాన్ని అందుకుని కార్యాలయానికి వచ్చాం. క్షణాల్లో పని పూర్తయ్యింది. సంతోషంగా ఉంది' అని రాశి ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా రిజిస్ట్రార్ సత్యనారాయణ సైతం ప్రజలు స్లాట్ బుకింగ్ పద్ధతిపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా రిజిస్ట్రేషన్లకు సులువు అవుతుందని పేర్కొన్నారు. తొలిరోజే 15కు పైగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు.

బదిలీ ఉత్కంఠ

- కసరత్తు చేస్తున్నారంటూ ప్రచారం
- జేసీ ధాత్రిరెడ్డికి పదోన్నతి ఛాన్స్



కలెక్టర్ వెట్రిసెల్వి



జేసీ ధాత్రిరెడ్డి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొంత మంది ఐఏఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేయబోతుందన్న సమాచారం ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ పెంచింది. గతేడాది జూన్‌లో తెలుగుదేశం ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టింది. ఆ వెంటనే జిల్లాల్లో ఐపీఎస్, ఐఏఎస్‌లను మార్పులు, చేర్పులు చేశారు. ఈ క్రమంలోనే కలెక్టర్‌గా వెట్రి సెల్వి జూన్ నాల్గవ వారంలో బాధ్యతలు చేపట్టారు. ఈ తొమ్మిది నెలల వ్యవధిలో కలెక్టర్‌గా ఆమె తన సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. ఆమె ఇప్పటికే వేరే ప్రాంతానికి వెళ్లేందుకు అనువుగా ప్రభుత్వానికి 'రిక్వెస్ట్' పెటుకున్నట్టు సమాచారం. జాయింట్ కలెక్టర్ కె.ధాత్రిరెడ్డి గతేడాది జూలైలో జిల్లాకు వచ్చారు. ఆమె ఇప్పటికే పదోన్నతి దశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో జేసీకి పదోన్నతి కల్పిస్తారా, లేకుంటే జేసీగానే మరికొంతకాలంపాటు ఇక్కడే కొనసాగిస్తారా.. అన్న చర్చ జరుగుతోంది.

నేడు అపరభద్రాద్రిలో ఎదుర్కోలు ఉత్సవం

చాట్రాయి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అపర భద్రాద్రి చనుబండ కోదండరామస్వామి ఎదుర్కోలు ఉత్సవం(వధూవర అన్వేషణ) శనివారం రాత్రి 8 గంటలకు జరుగుతుందని, ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఆలయంలో గజాపట్నం నిర్వహించారు. సంతానం లేని దంపతులు ఉపవాసం ఉండి గజాపట్నంలో గరుడ ముద్ద పట్టుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థల అనుమతులు రద్దు చేయండి

- ఏలూరులో ఆటో డ్రైవర్ల నిరసన ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థల అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరులో శుక్రవారం ఆటో డ్రైవర్లు పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేసి ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ పెట్టుబడి లేకుండా కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని కొల్లగొడుతున్నారన్నారు. నగరంలో ఆటో స్టాండ్‌లకు పార్కింగ్ స్థలాలు లేవని, రవాణ రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఆర్.లింగరాజు, అమర్ కుమార్, జె.గోపి, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.





నగరంలో ఆటోలతో నిరసన ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

పేదలకు అండగా..

- స్వయం ఉపాధి పేరిట ప్రభుత్వ ప్రోత్సాహం
- వివిధ కార్పొరేషన్లలో భారీ కదలిక
- ఉపాధి కోసం వేలాది దరఖాస్తులు
- ఐదేళ్ల విరామం అనంతరం మళ్లీ కళకళ
- ఎమ్మెల్యేలపై పెరుగుతున్న ఒత్తిళ్లు
- బ్యాంకర్లు సహకరిస్తేనే అనుకున్న లక్ష్యం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒకప్పుడు స్వయం ఉపాధి కల్పనకు వీలుగా తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పేద వర్గాలు నిలదొక్కుకునేందుకు వీలుగా అర్హులైన వారిని గుర్తించి వారికి రుణకల్పన చేసేలా బ్యాంకర్లను ప్రోత్సహించేది. కాని గడిచిన ఐదేళ్లగా జగన్ ప్రభుత్వంలో కార్పొరేషన్లన్నీ దాదాపు నిర్వీర్యమయ్యాయి. పేద వర్గాలకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చే అవకాశాలున్నా ఆ దిశగా చూడనేలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావొస్తుంది. ఒక్కో పథకం తెర ముందుకు వస్తోంది. పేదవర్గాలను కాస్తంత ఒడ్డుకు తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. ఇంతకు ముందు అమలు చేసిన ఆదరణ స్థాయిలో స్వయం ఉపాధి కల్పనకు బీజం పడింది. వివిధ సామాజిక వర్గాల కార్పొరేషన్లను అప్రమత్తం చేసింది. ఆయా కార్పొరేషన్లలో ఇప్పటికే భారీ కదలిక వచ్చింది. బ్రాహ్మణ, క్షత్రియ కమ్మ, రెడ్డి, కాపు, వైశ్య, బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల న్నింటికీ జీవం పోసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయా కార్పొరేషన్ల పరిధిలో పేద వర్గాలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా గత నెలలో రూపొందించిన ప్రణాళిక దాదాపు అక్కరకు వస్తోంది. వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారంతా పెద్ద ఎత్తున స్వయం ఉపాధి దరఖాస్తులు చేసి అధికారుల ఇంటర్వ్యూలకు హాజరవుతున్నారు. సరాసరిన రూ.లక్షన్నర నుంచి రూ.ఐదు లక్షల వరకు రుణం లభించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. జిల్లా పరిధిలో 30 వేలకు పైగా వివిధ పథకాల కింద దరఖాస్తులు అందాయి. బ్రాహ్మణ కార్పొరేషన్ పరిధిలో 77 స్కీంలు అతి తక్కువగా ఉన్నాయి. అత్యధికంగా బీసీ కార్పొరేషన్‌లో 20 వేలకు పైగానే ఉన్నాయి. 2014-19 మధ్య తెలుగుదేశం అధికారంలో ఉండగా అప్పట్లో ఆదరణ పథకం కింద వివిధ కుల వృత్తుల వారికి రుణ సదుపాయం అందించే దిశగా ప్రణాళిక అమలు చేసింది.

కార్పొరేషన్ పేరు	స్వయం ఉపాధి పథకాలు
బ్రాహ్మణ	77
కమ్మ	644
క్షత్రియ	87
కాపు	7945
రెడ్డి	88
వైశ్య	967
బీసీ	20,208
ఈబీసీ	164
మేదర/కుమ్మరి	256

బ్యాంకర్ల సాయమే కీలకం

ప్రభుత్వ పథకాలు అమలులోకి రావాలంటే అదీ స్వయం ఉపాధి కల్పనకు అంటే బ్యాంకర్లు సాయ పడాల్సిందే. ఇప్పటికే దరఖాస్తులు ప్రతీ బ్యాంకు పరిధిలోనూ భారీగా వచ్చిపడ్డాయి. గతంలో రుణం పొందిన వారిలో అత్యధికులు సకాలంలో ఇన్‌స్టాల్‌మెంట్ (వాయిదా) సొమ్ములు చెల్లించకపోవడంతో బ్యాంకర్లు వసూళ్ల కోసం ముప్పుతిప్పలు పడాల్సి వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారికి స్వయం ఉపాధి కల్పన దిశగా చర్యలు తీసుకుంటున్నందున కొంతలో కొంతైనా రుణ సదుపాయం కల్పించకుంటే లక్ష్యం కాస్తా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులన్నీ ప్రభుత్వ లక్ష్యం మేరకు కొంత రుణ సదుపాయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా బ్రోకర్లు రంగ ప్రవేశం చేసి రుణాలు ఇప్పిస్తాం.. మా వాటాగా 15 నుంచి 20 శాతం వచ్చిన రుణంలో చెల్లించాల్సిందేననే షరతు పెడుతున్నట్టు సమాచారం.



ఏలూరు మండల కార్యాలయంలో స్వయం సోపానం పథకం దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యేలకు చేతినిండా పని..

వివిధ కార్పొరేషన్లలో దరఖాస్తుల ప్రక్రియతోపాటు అర్హులను గుర్తించే పని వేగంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై స్థానికంగా ఒత్తిడి పడుతోంది. తమకు రుణం వచ్చేలా, తాము ఎంపిక య్యేలా చూడాల్సిందిగా ఎమ్మెల్యేలపై స్థానిక నేతల ద్వారా లబ్ధిదారులు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేలు కాస్త మేము చెప్పిన వారి సంగతి చూడాలంటూ అధికారు లకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షంతో రైతుల గుండెల్లో గుబులు

చాట్రాయి/ముసునూరు/కలిదిండి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి మబ్బుల వాతావరణం కొనసాగుతూ చిరుజల్లులు పడుతుండడంతో రైతులు పరుగులు పెడుతున్నారు. మండలంలో రబీ సీజన్‌లో 8,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం అధిక శాతం పంట కల్లాలపై ఉంది. ఇప్పుడు వర్షం పడితే పంట తడిసిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముసునూరు మండలంలో గురువారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురియడంతో పొగాకు రైతుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 800 ఎకరాల్లో పొగాకు సాగు చేయగా 50 శాతం పందిళ్ల కోసి మండెలు సైతం వేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వాతావరణ మార్పులతో కలిదిండి మండలంలో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆకాశం మబ్బులు కమ్ముకుని చల్లగా ఉండడం తర్వాత నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ హెచ్చుతగ్గులు ఏర్పడి చేపలు, రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు హడావుడిగా పట్టుబడులు చేస్తున్నారు.



ముసునూరు మండలం గోపవరంలో పొగాకు పందిరిపై పరదాలు కప్పిన దృశ్యం

వనామీపై ట్రంప్ సుంకాల ప్రభావం

- రూ.30 ధర పతనం
- ఐదు రోజులు పట్టుబడులు వద్దంటున్న కంపెనీలు
- ఆందోళనలో ఆక్వా రైతులు

■ లోపలి పేజీలో..



సభా వేదిక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆగిరిపల్లిలో సీఎం సభ

నూజివీడు ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు ఈ నెల 11న నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ మేరకు పర్యటన దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. పీ-4 కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం విచ్చేయనున్నారు. ఈ మేరకు బహిరంగ సభను ఆగిరిపల్లిలో ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం, టీడీపీ నాయకులు నిర్ణయించినట్టు సమాచారం. ఆగిరిపల్లి జడ్పీ పాఠశాలలో సభ వేదిక స్థలాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ స్మరణరాజ్, అధికారులు పరిశీలించారు. హెలిప్యాడ్‌ను వడ్లమాను వెంచర్ స్థలం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సభాస్థలికి చేరుకుని మాట్లాడేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జేఈఈ మెయిన్‌కు 250 మంది హాజరు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు కేంద్రంలో ఉదయం షిఫ్టులో జరిగిన పరీక్షకు 115 మంది విద్యార్థులను కేటాయించగా 106 మంది, మధ్యాహ్నం షిఫ్టునకు 152 మందికి 144 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 17 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

సజావుగా టెన్త్ స్పాట్!

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పలు అభ్యంతరాలు, అర్జీలతో మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తొలిరోజున పట్టుబట్టిన టీచర్లు శుక్రవారం స్పాట్ డ్యూటీలకు హాజరు కావడంతో పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ గాడిన పడింది. మరోవైపు జవాబు పత్రాలు ఆలస్యంగా రావడంతో వాయిదా పడిన సోషల్ స్టడీస్ సబ్జెక్టు ఆన్సర్ స్క్రిప్టుల వాల్యుయేషన్ శుక్రవారం పూర్తిస్థాయిలో మొదలైంది. ఇంగ్లీషు

- మిగతా 8లో


వనామీ రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

వనామీపై ట్రంప్ సుంకాల ప్రభావం

రూ.30 ధర పతనం

ఐదు రోజులు పట్టుబడులు వద్దంటున్న కంపెనీలు

ఆందోళనలో ఆక్వా రైతులు

కైకలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాలు పెంచడంతో దాని ప్రభావం ఇక్కడ ఆక్వా రంగంపైనా తీవ్రంగా పడింది. అమెరికా దిగుమతి చేసుకునే అన్ని రకాల ఉత్పత్తులపై 27 శాతం పన్నులు పెంచడంతో ఆక్వా రంగం దెబ్బతింది. దీంతో రైతులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా ఫ్రాస్‌ఫార్మర్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు మరో ఐదు రోజుల పాటు రైతులు ఎక్కడా రొయ్యల పట్టుబడులు చేయవద్దని వైరస్ సోకితేనే పట్టుబడి చేసేందుకు ముందుకు వెళ్లాలని సూచించారు. 100 కౌంటు ధర రెండు రోజులు క్రితం రూ.250 ఉంటే శుక్రవారం మార్కెట్ ధర రూ.220కు కొనుగోలు చేస్తున్నారు. రూ.30 వరకు పతనమైంది. ప్రపంచంలో అన్ని దేశాలకంటే భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే మెరైన్ ఉత్పత్తులే తక్కువ ధరకు అమెరికాకు రవాణా అవుతున్నాయి. భారత్‌పై కూడా భారీగా ట్యాక్సు పెంచడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 2.50 లక్షల ఎకరాల్లో రైతులు రొయ్యలను సాగు చేస్తున్నారు.

అమెరికాకు ప్రతీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ నుంచి 17.2 లక్షల టన్నులు వనామీ రొయ్యలు ఎగుమతి అవుతుంటాయి. ఇప్పటికే పట్టుబడులు నిలిపివేయడంతో ఆక్వా కూలీలకు ఉపాధి కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పట్టుబడులు నిలిపివేయడం వలన రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి ఆక్వా ఉత్పత్తులపై ఇరు దేశాలు చర్చలు జరిపి సుంకాలు తగ్గించేలాగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


నృత్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

జాతీయ నాటక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా స్వేచ్ఛ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో ఉగాది వేడుకల్లో భాగంగా నిర్వహించిన జాతీయ నాటక పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా హైద్రాబాద్‌లోని విజయశాంతి కల్చరల్ అసోసియేషన్ ప్రదర్శించిన స్వేచ్ఛ నిలిచింది. ఉత్తమ నటుడిగా స్వేచ్ఛ నాటికలో నటించిన గోవాడ వెంకట్, ఉత్తమ దర్శకుడిగా దర్శకుడు బీఎం రెడ్డి, ఉత్తమ రచన కర్తగా శివరాంలు అవార్డులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విజేతలకు ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుబ్బళ్ల గోపాలకృష్ణ, తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెలువాది వేణుగోపాల్‌లు బహుమతులు అందించారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ నాటకాలకు జీవం పోసి ఉత్సవాలు నిర్వహించి వాటిని ఆదరించడం అభినందనీయమని, ప్రభుత్వాలు కూడా నాటకాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.నృత్యపోటీల్లో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందించారు.బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, సినీ ఎగ్జిబిషన్ అసోసియేషన్ అధ్యక్షుడు యెలిశెట్టి మోహన్, నాటక పరిషత్ అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు, రేపు భీమవరంలో రాష్ట్ర స్థాయి భగవద్గీత పోటీలు


వివరాలు తెలుపుతున్న నిర్వాహకులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5,6 తేదీల్లో ఆనంద గీతా యజ్ఞం రాష్ట్ర స్థాయి భగవద్గీత పఠన పోటీలను ఉద్దరాజు ఆనంద రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని ఆనంద ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు తెలిపారు. శుక్రవారం పోటీల వివరాలను వెల్లడించారు. ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను 4 విభాగాల్లో నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు సుమారు వెయ్యిమంది రిజిస్ట్రేషన్ చేసుకు న్నారన్నారు. ఉదయం గం 9 నుంచి సాయంత్రం 5 వరకు, పోటీ ల్లోని విజేతలకు 13న ఆనందరాజు వర్ధంతి సభలో ప్రముఖుల సమక్షంలో బహుమతులు అందిస్తామని తెలిపారు. ప్రతి విభాగంలోని ప్రథమ రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ రూ.2 వేలు, కన్సోలేషన్ రూ.వెయ్యి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందిస్తామని, 108 శ్లోకాల పోటీల్లో విజేతలకు ప్రథమ రూ.6 వేలు, ద్వితీయ రూ.4 వేలు, తృతీయ రూ.2 వేలు, జ్ఞాపిక, పాల్గొన్న వారందరికి ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు. నిర్వాహకులు దాయన చంద్రాజీ, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

భీమవరంలో 24 నుంచి జాతీయస్థాయి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) భీమవరం డీఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీల్లో చైతన్య భారతి 18వ జాతీయస్థాయి నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు చైతన్యభారతి నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు. శుక్రవారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను నాటక పరిషత్ సభ్యులు కలిసి నాటక మహోత్సవానికి రావాలని కోరారు. 17 ఏళ్లుగా నాటక పోటీలు నిర్వహిస్తూ పురస్కారాలను అందిస్తున్నట్లు మంత్రికి వివరించారు. నాటక పరిషత్ కార్యదర్శి మంతెన రామ్‌కుమార్ రాజు, డాక్టర్ కర్రెడ్డి సత్యనారాయణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ పాల్గొన్నారు.



నరేష్ బాబుకు నంది పురస్కారం

పాలకొల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు చవాకుల ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకు నంది పురస్కారం లభించింది. రాజమండ్రిలో శుక్రవారం రోటరీ హాల్లో పాన్ ఇండియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాతృభాషా, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో నరేష్ బాబు చేసిన సామాజిక సేవలను గుర్తించి నంది పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా తెలిపారు. పిఠాపురం సంస్థానం రాజ వంశీయులు రాజారావు వేంకట మహీపతి రామ రత్నరావు బహదూర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్టు నరేష్‌బాబు తెలిపారు. గజల్ శ్రీనివాస్, కళారత్న కత్తిమండ ప్రతాప్, నర్సిపల్లి హారిక, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు గుబ్బల రాంబాబు, చెరుకువాడ రంగసాయి, అట్టాడ అవినాష్ పాల్గొన్నారు




హాయిగా.. కూల్‌గా..

మండుటెండలో అయినా ఆ రహదారిలో ప్రయాణం హాయిగా సాగిపోతుంది. ఆ దారిలో వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు కొంత సేపు చెట్లనీడన ఆగి సేద తీరుతుంటారు. ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల నుంచి వట్లూరు మినీ బైపాస్ సెంటర్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. చల్లని గాలిలో ఏమి హాయిలే ఇలా..అనుకుంటూ ఈ రోడ్డుపై వెళ్తున్న వాహనదారులతో పాటు స్థానికులు సైతం మధ్యాహ్న సమయంలో ఇక్కడకు చేరుకుని కొంతసేపు విశ్రమించిన అనంతరం గమ్యస్థానాలకు బయలు దేరుతున్నారు.

- ఏలూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

రబీ సేఫ్


పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి జలాలు

నిలకడగా గోదావరిలో నీటి నిల్వలు

ఉమ్మడి జిల్లాల పంటలకు సరిపడా సాగునీరు

జలవనరుల శాఖ ముందస్తు చర్యలు

పోలవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలల్లో గోదావరిలో నీటి నిల్వలు తగ్గి పోవడం వల్ల రబీ సాగుకు సాగునీరు తగినంతగా ఉండక రైతులు పంట విరామం పాటించవలసిన పరిస్థితులు ఉండేవి. ఈ ఏడాది ఆ పరిస్థితు లకు భిన్నంగా రబీలో వరి, మొక్కజొన్న, అపరాలు, కూరగాయల సాగుకి కూడా సాగునీరు అందే విధంగా జలవనరులశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలలో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగు నీరందింది. గత ఏడాదితో పోలిస్తే గోదావరిలో ఈ ఏడాది ఏప్రిల్ నాటికి నీటి నిల్వలు ఆశాజనకంగానే ఉన్నాయి. దీనికి కారణం జలవనరుల శాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం సీలేరు నుంచి నిత్యం 9,500 క్యూసెక్కుల జలాలను గోదావరిలోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవడమే.

గోదావరిలో 10,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పోలవరం ప్రాజెక్టు వద్ద గతేడాది నీటిమట్టం స్పిల్వే ఎగువన 21.500 మీటర్లు ఉండగా ఈ ఏడాది 22.180 మీటర్లు నమోదైంది. స్పిల్వే దిగువన గతేడాది 14 మీటర్లు ఉండగా ఈ ఏడాది 15.330 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాం వద్ద గతేడాది 21.550 మీటర్లు ఉండగా ఈ ఏడాది 22.230 మీటర్లు, దిగువ కాఫర్ డ్యాంకి దిగువన గతేడాది 13.450 మీటర్లు ఉండగా ఈ ఏడాది 13.440 మీటర్లు నమోదైనట్టు పోలవరం ప్రాజెక్టు డీఈ మాధవరావు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన నీటిమట్టం గేట్ల క్రస్ట్ లెవెల్‌కి దిగువకు ఉండడం వల్ల స్పిల్వేలో ఉన్న 10 స్లూయిజ్‌ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తూ నీటి పంపిణీని క్రమబద్ధీకరిస్తున్నారు. పోలవరంలో గతేడాది గోదావరి నీటిమట్టం 13.597 మీటర్లు నమోదైందని సీడబ్ల్యూసీ సిబ్బంది నవీన్ నాయుడు తెలిపారు. పట్టిసీమ మేజర్ ఎత్తిపోతల పథకం వద్ద నీటి మట్టం 13.357 మీటర్లు నమోదైనట్టు డీఈ భాస్కర రామకృష్ణ తెలిపారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 13.53 మీటర్లు నమోదైందని రబీ సీజనుకు ఉభయ గోదావరి, మధ్య గోదావరి డెల్టాలకు 10,300 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్లు, గోదావరిలో 10,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు గోదావరి హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు.

పట్టిసీమ వద్ద లో లెవెల్..

గోదావరిలో నీటిమట్టం ప్రస్తుతం నిలకడగా ఉండడం వల్ల పోలవరం కడమ్మ ఎత్తిపోతల పథకం, గూటాల పంపింగ్ స్కీం, వేగేశ్వరపురం పంపింగ్ స్కీం, ఆరికిరేవుల పంపింగ్ స్కీంల ద్వారా ఉమ్మడి పశ్చిమ డెల్టాలో రబీకి తగినంత సాగు నీరందుతుంది. పట్టిసీమ వద్ద గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు దిగువకు ఉండడం వల్ల పట్టిసీమ నీటి విడుదల సాధ్యం కాలేదు. దీని ప్రభావం వల్ల పోలవరం ప్రాజక్టు కుడి ఎడమ కాలువల పరిధిలో రబీ సాగుకి సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగు నీరు లేకుండా పోయింది. పోలవరం ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలకు డివిజన్ల వారీగా లాకులు నిర్మించి వరదల సీజను చివరి రోజుల్లో ఎక్కడికక్కడ లాకులు మూసి నీటి నిల్వలు ఉంచడం, కుడి ఎడమ కాలువల పరిధిలో పంటపొలాల మధ్య చెరువులు, రిజర్వాయర్ ట్యాంకులు నిర్మించి నీటిని నింపి నిల్వలు ఉంచడం ద్వారా సాగునీటి కష్టాలను అధిగమించవచ్చని పలువురు రైతులు సూచిస్తున్నారు.

సిద్ధాంతం, నడిపూడి, కోడేరుల్లో ఇసుక మేటలు..

ఆచంట/పెనుగొండ (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం, ఆచంట పరిధిలో గోదావరి ప్రవాహం తగ్గి నీటిమట్టం తగ్గడంతో గోదావరిలో అక్కడక్కడా ఇసుక తెన్నెలు దర్శనమిస్తున్నాయి. సాధారణ రోజుల్లో గోదావరి ఎంతలోతు ఉంటుందో ఎవరికీ తెలియదు. గోదావరి నీటి మట్టం బాగా తగ్గి ఉండటంతో బ్యాంక్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీరు అందక సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వేసవిలో సిద్ధాంతం, నడిపూడి, కోడేరు వద్ద నీటిమట్టం బాగా తగ్గింది. ఇసుక మేటలను తొలగిస్తే గోదావరిలో ఎప్పుడూ నీటి ప్రవాహం ఉంటుందని సాగునీటికి, తాగునీటికి కూడా ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు.


ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి జలాలు

ఉపనదుల నీరే ఆధారం


రుద్రమ్మకోట వద్ద సాధారణ స్థితిలో గోదావరి

వేలేరుపాడు (ఆంధ్రజ్యోతి): జూలై నెల నుంచి సెప్టెంబరు నెలాఖరువరకు ఉధృతంగా ప్రవహించే గోదావరి నది అక్టోబరు నెల నుంచి ప్రవాహాలు తగ్గి సాధారణ స్థితికి చేరుకుని ఏప్రిల్, మే నెలల్లో నీటి మట్టాలు పూర్తిగా పడిపోతాయి. గత సెప్టెంబరు నుంచి వర్షాలు లేకపోవడంతో గోదావరి నదికి నీటి ప్రవాహాలు భారీగా పడిపోయాయి. ప్రస్తుతం గోదావరి మొత్తం చిన్న పిల్ల కాల్వలా ప్రవహిస్తూ ఇసుక దిబ్బలు దర్శన మిస్తున్నాయి. గోదావరి ఎగువ భాగాన నిర్మించిన ప్రాజెక్టులు నీటి విడుదలను పూర్తిగా నిలిపి వేయడంతో గోదావరికి నీటి ప్రవాహాలు ఘననీయంగా పడిపో యాయి. అయితే గోదావరికి ఉప నదులైన తాలిపేరు, కిన్నెరసాని, శబరి నదుల నుంచి కొద్దిపాటి నీటి ప్రవాహాలు వచ్చి గోదావరిలో కలుస్తున్నాయి. దీని కారణంగా ప్రస్తుతం కూనవరం వద్ద 10 వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. ఈ ఉపనదుల నుంచి వచ్చే నీటి కారణంగానే పోలవరం అక్కడ నుంచి ధవళేశ్వరానికి నీటిని విడుదల చేసి కాల్వలకు నీరు వదిలే అవకాశం ఇప్పటి వరకు ఉంది.

డీఎస్సీ పరీక్షార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ- 2025 ఉపాధ్యాయ నియామకాల పరీక్షకు సిద్ధమవుతున్న బీసీ, ఈడబ్ల్యుఎస్ (ఈబీసీ) అభ్యర్థులు ఇంటి నుంచే ఉచిత ఆన్‌లైన్ శిక్షణ పొందేందుకు జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్.వి నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. టెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, టీటీసీ /బీఎడ్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా ఫోటోస్టాట్ కాపీలతో దరఖాస్తులను ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని బీసీ సంక్షేమాధికారి కార్యాలయంలో స్వయంగా అందజేయాలని సూచించారు. వివరాలకు కార్యాలయ ఫోన్ నంబరు 86861 80018లో సంప్రదించాలని కోరారు.


భీమవరం మార్వాడీ సందులో భిక్షాటన చేస్తున్న చిన్నారులు

అయినా ఆగలేదు.. భిక్షాటన చేయిస్తున్న దళారులు

భీమవరం క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, అధికారులు భిక్షాటన దందాలపై గట్టి నిఘా పెట్టి ఎన్ని హెచ్చరికలు చేసినా కొందరిలో మార్పు రావడం లేదు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు దళారులు చిన్నారులతో భిక్షాటన చేయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పెద్ద పెద్ద సిటీల్లోను, పట్టణాల్లోను ఇటువంటి దందాలు కొనసాగేవి. పేదలను ఎంచుకుని వారికి రోజుకు ఇంత నగదు ఇస్తామని చెప్పి వారితో భిక్షాటన చేయించడం ఇప్పుడు వ్యాపారంగా మారింది.. ఇటువంటివి జిల్లాలో కొన్ని ముఠాలు ఉన్నట్లు సమాచారం. వారు కావాలనే చిన్నారులను ఎంచుకుని వారికి రద్దీగా ఉండే కూడళ్ళు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద భిక్షాటన చేయిస్తుంటారు. పిల్లలతో పాటు వారి తల్లి దండ్రులను కూడా ఈ వృత్తిలోకి దింపుతారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 3న కథనం రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. వెంటనే యాచక వృత్తి చేస్తున్న చిన్నారులను హోమ్‌కు తరలించాలని ఆదేశించడంతో గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారులు కొంతమంది చిన్నారులను చిల్డ్రన్ హోమ్‌కు తరలించారు.



లక్ష గాజుల అలంకరణలో కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఐదు లక్షల గాజుల అలంకరణలో భక్తులకు దర్శన మిస్తున్న అమ్మవారికి శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సోమవారం వరకూ జరగనున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు గాజుల అలంకరణలో నిండు ముత్తైదువులా భక్తులకు దర్శనమిస్తున్నారు.ఈనెల 7న గురువారం ఆలయ ఆవరణలో మహిళలతో కుంకుమపూజ ఆ తర్వాత చండీహోమం జరుగుతుందని ఆలయ అర్చకుడు భైరవస్వామి తెలిపారు.

నేడు భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 6వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం అనంతరం జంగారెడ్డిగూడెం చేరుకోవడానికి కూడా బస్సులను నడుపుతామని తెలిపారు. భద్రాచలం వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దువ్వలో దాహం కేకలు


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

తణుకు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం ముదరక ముందే తణుకు రూరల్ మండలం దువ్వలో దాహం కేకలు వినిపిస్తున్నాయి.గ్రామంలో రెండు రక్షిత మంచినీటి పథకాలు వున్నప్పటికీ గతంలో మాదిరిగా ఇప్పుడు తాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన జల్ జీవన్ పథకంలో పనులు పూర్తి కాకపోవడం కారణంగా ఇప్పుడు తాగునీరు అందడం లేదని చెబుతున్నారు. దువ్వలో జల్ జీవన్ పథకంలో ఇంటింటికి కుళాయి కనెక్షన్ అందించే కార్యక్రమం చేపట్టారు. దీంతో గ్రామంలోని పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టి పూర్తి చేసినప్పటికీ వాటిని ఇంకా మంచినీరు రావడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లకు ట్యాప్‌లకు, జంక్షన్ వాల్వులు ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా నిలిపివేసినట్లు పేర్కొంటున్నారు. గ్రామంలోని కొన్ని కుళాయిల నుంచి సన్నని దారగా వచ్చే నీటి కోసం పదుల సంఖ్యలో బిందెలు, బక్కెట్‌లు బారులు తీరి వుంటున్నాయి. దీంతో పాటు గ్రామంలో శశి స్కూల్ రోడ్డు, గీతామందిరం ఏరియాలలో కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అవసరాలకు సరిపడా నీరు అందడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

• మూడు రోజులకోసారి నీరు



దువ్వ గ్రామంలోని శశి రోడ్డు, గీతా మందిరం ఏరియా వాసులకు ట్యాంకర్ ద్వారా మూడు రోజులకోసారి మంచినీరు అందుతుంది. కుళా యిల నుంచి నీరు రావడం లేదని సచివాల యంలో చెప్పినా ఎవరూ పట్టించు కోవడం లేదు. వారం రోజుల్లో బాగు చేస్తామని చెప్పి 15 రోజులైనా ఇప్పటికీ కుళాయిల నుంచి నీరు రావడం లేదు. ట్యాంకర్ నుంచి మూడు రోజు లకోసారి వస్తుంది. మంచి నీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- మంగతాయారు, దువ్వ

• జంక్షన్ వాల్వులు ఏర్పాటు చేయాలి

దువ్వ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు.. పైప్ లైన్లు, కుళాయిల మధ్య అక్కడక్కడ వాల్వులు ఏర్పాటు చేయాలి. కాంట్రాక్టర్ త్వరలోనే ఏర్పాటు చేస్తానని చెప్పారు. వెంటనే వాల్వులు బిగిస్తాం.

-అడ్డా వెంకట సూర్యనారాయణమూర్తి (అడ్డా బాబు), గ్రామ సర్పంచ్, దువ్వ



అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎన్ఆర్ఐ అనంతకోటిరాజు

జన్మభూమి అభివృద్ధికి రూ.35.15 కోట్లు

వేగేశ్న ఫౌండేషన్ ద్వారా ఎన్ఆర్ఐ అనంత కోటిరాజు దాతృత్వం

శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రులు శ్రీనివాసవర్మ, నిమ్మల

గణపవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జన్మభూమి అభివృద్ధికి రాజువేగేశ్న ఫౌండేషన్ (ఇండియా) ద్వారా ఎన్ఆర్ఐ వేగేశ్న అనంత కోటి రాజు కోట్లాది రూపాయలు వెచ్చించడం స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. అనంతకోటిరాజు స్వగ్రామం గణపవరంలో సుమారు 8 ఎకరాల్లో రూ.20 కోట్లతో చెరువుల అభివృద్ధి, రూ.15కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణం, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, పాఠశాలల అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణం, పేదలకు ఇళ్ల స్థలాలకు మొత్తం రూ.35.15 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను శుక్రవారం మంత్రులు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సభలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సంపాదనలో కొంత భాగం స్వగ్రామం అభివృద్ధికి ఖర్చు చేస్తున్న వేగేశ్న ఫౌండేషన్ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్ఆర్ఐల సేవలు ఎంతో అవసరమన్నారు. ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ వేగేశ్న ఫౌండేషన్ ఇండియా చైర్మన్ అనంత కోటిరాజు చేపడుతున్న ఆధ్యాత్మిక, విద్య, తాగునీరు వంటి సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ అనంతకోటి రాజు సేవలు మరువలేనివని, గణపవరంలో వంద పడకల ఆసుపత్రి, బీసీ హాస్టల్ నిర్మాణ స్థలాలు కూడా సమకూర్చాలని కోరారు. అనంతరం ఎన్ఆర్ఐ అనంతకోటిరాజు దంపతులను కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్థానికులు గజమాలలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీపీ దండు రాము, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు పొత్తూరి వాసురాజు, ఇందుకూరి రామకృష్ణంరాజు, గ్రామాభివృద్ధి కన్వీనర్ కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, సర్పంచ్ మూరా అలంకారం, తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీరంలో రూ.13.50 కోట్లతో రక్షణ గోడ

- పీఎం లంక వద్ద ఎనిమిది మీటర్ల వెడల్పుతో నిర్మాణం
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

నరసాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సముద్ర కోత నివారణకు పీఎంలంక వద్ద రూ.13.50 కోట్లతో రక్షణ గోడ నిర్మాణం చేపడతామని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ విప్ నాయకర్‌తో కలిసి గ్రామంలో డిజిటల్ భవనంలో అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. డిలైట్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో ఒక కిలో మీటరు మేర ఎనిమిది మీటర్ల వెడల్పుతో గోడ నిర్మాణం జరుగుతుందన్నారు. ఆ తరువాత మరో కిలోమీటర్ నిర్మిస్తామన్నారు. ఏడాదిలో ఈ పనులు పూర్తవుతాయన్నారు. నిపుణుల సూచనల అనుగుణంగా చేపట్టే ఈ పనుల వల్ల సముద్ర కోత తగ్గుతుందని, ప్రజలు సహకరించాలన్నారు. గ్రామంలో సుమారు వంద నివాసాల పైకప్పులపై త్వరలో సోలార్ రూఫ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం వేములదీవిలో చేపట్టిన ఉపాధి పనులు, లక్ష్మణేశ్వరంలోని నక్కావారిపాలెంలో గృహాలను కలెక్టర్ పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రభుత్వ భూమి కబ్జాపై కదిలిన అధికారులు



దొడ్డనపూడిలో రికార్డులను పరిశీలిస్తున్న భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

దొడ్డనపూడిలో భూమిని పరిశీలించిన భీమవరం ఆర్డీవో

కాళ్ళ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. కాళ్ళ మండలం దొడ్డనపూడిలో ఆర్ఎస్ నెం. 205/1ఏ, 1బిలో ఉన్న ప్రభుత్వ భూమిని సమీప రైతు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారంటూ 'ప్రభుత్వ భూమి కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల స్థాయి అధికారులతో కలిసి ఆక్రమణకు గురైన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భూమి రికార్డులను ఆయన పరిశీలించారు. భూమి తమదే అంటున్న సమీప రైతుకు నోటీసులు జారీ చేసి, సర్వే నెంబర్ల భూమి పూర్తిస్థాయి రికార్డులను తీసుకుని సోమవారం తన కార్యాలయంలో హాజరుకావాలని తహసీల్దార్ జి.సుందర్ సింగ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట మండల సర్వేయర్ ప్రవీణ్, వీఆర్వో చిట్టిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలు ప్రయాణిస్తున్న ట్రక్ ఆటో బోల్తా

- పది మందికి గాయాలు

చింతలపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెలగలపల్లి నుంచి వస్తున్న ఆటో చింతలపూడి శివారు ఆంథోని నగర్ వద్ద శుక్రవారం ఉదయం ట్రక్ బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న పది మంది మహిళా కూలీలకు గాయాలయ్యాయి. వారిని చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించగా కె.లక్ష్మి అనే మహిళను మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. తెలంగాణ సరిహద్దు దిద్దుపూడి గ్రామానికి చెందిన మహిళా కూలీలు వెలగలపల్లిలోని మొక్కజొన్న ఫ్యాక్టరీలో నైట్ షిఫ్ట్‌లో పనిచేయడానికి వెళ్ళి శుక్రవారం ఉదయం తిరిగి వస్తున్న సమయంలో ట్రక్ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారికి చికిత్స అందించారు. మిగిలిన తొమ్మిది మంది క్షేమంగా ఉన్నట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

ఆగివున్న లారీని ఢీకొన్న మరో లారీ

పెదపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కలపర్రు గౌరీశంకర్ డాబా వద్ద రోడ్డు పక్కన ఆగి వున్న లారీని మరో లారీ ఢీకొంది. లారీ డ్రైవర్ ఈనెల 1న తెల్లవారు జాము రెండు గంటల ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో ఆగి వున్న లారీ డ్రైవర్ వెంకటేశ్వరరావుకు గాయాలయ్యాయి. అతడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై కట్టా శారద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ షాపులో చోరీ

సత్య సెల్‌ఫోన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి ఒక సెల్‌ఫోన్, రూ.1500 నగదు ఎత్తుకెళ్లారు. వసంతవాడ గ్రామానికి చెందిన షాపు యజమాని గుడిమెట్ల శివకుమార్ పెదపాడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

పల్లెలకు ఉపాధి శోభ

ఉపాధి హామీ నిధులతో ఏలూరు జిల్లాలోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం



జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో నిర్మించిన సీసీ రహదారి

ఏలూరు సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధులు అభివృద్ధికి ఆసరాగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. జిల్లాలో సమర్థవంతంగా ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్నారు. కూలీలకు ఉపాధి కల్పనతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి పథకం ఎంతో ఉపయోగ పడుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం 38 లక్షల మొక్కల పెంచడానికి చర్యలు తీసుకున్నారు. పాడి రైతులు, ఉద్యాన రైతులకు మరింతగా ఉపాధి హామీ పథకం అనుసంధానం చేస్తూ పశువులకు నీటి తొట్టెలు, షెడ్లు ఏర్పాటుకు నిధులు కేటాయించారు. పామాయిల్, కోకో, మామిడి తదితర పంటలకు చేయూత ద్వారా 10 వేల ఎకరాలకు పైగా లక్ష్యంతో ఉపాధి హామీ ఉద్యాన రైతులకు తోడ్పాటునిస్తోంది. వాననీటిని పంటలకు దగ్గరలోనే ఒడిసిపట్టే విధంగా, భూగర్భ జలాల నిల్వలు పెంచడం కోసం ఫారం పాండ్స్, రింగ్‌ట్రెంచ్ పనులు చేయడానికి ఉపాధి నిధులను కేటాయించడమే కాకుండా ఆ పనులు త్వరితగతిన పూర్తి కావడానికి ప్రణాళికలు రూపొందించింది.



పశువులకు షెడ్లు ఏర్పాటు

జిల్లాలో పశువుల కోసం పశువుల షెడ్ల ఏర్పాటుకు ఉపాధి హామీ నిధులను కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో 639 పశువుల షెడ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 411 పశువుల తొట్టెలు నిర్మించడానికి కలెక్టర్ అనుమతి పొందారు.

ఐదు వేల ఫాం పాండ్స్ ఏర్పాటు

భూగర్భ జలాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఈ ఏడాది 5 వేల ఫాం పాండ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 3,200 ఫాంపాండ్స్ ఏర్పాటుకు అనుమతి పొందగా 561 పాండ్స్ నిర్మాణం పూర్తయింది.



ఉద్యమంలా సీసీ రోడ్ల నిర్మాణం

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలతో పాటు అన్ని మండలాల్లో 2024-25లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారుల నిర్మాణం ఉద్యమంలా కొనసాగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సీసీ రహదారుల నిర్మాణాలతో పల్లెల్లో వీధులు సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రూ.180.58 కోట్లతో 1,578 పనులను చేయాలని నిర్ణయించారు. 376.25 కిలోమీటర్ల మేర సీసీ రహదారులను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. ఇప్పటికే జిల్లాలో 228.11 కిలోమీటర్లు మేర 1168 పనులను పూర్తి చేశారు.

లక్ష్యానికి మించి పనిదినాలు

ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించడానికి డ్వామా శాఖ ఒక ప్రణాళికను రూపొందించుకోవడమే కాకుండా లక్ష్యానికి మించి ఇప్పటికే ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించి రాష్ట్రంలోనే కూలీలకు పని కల్పించడంలో అగ్రగామిగా నిలిచింది. జిల్లాలో కోటి 20 లక్షలు పని దినాలు లక్ష్యంకాగా ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు కోటి 23 లక్షలు పనిదినాలు కల్పించి 103 శాతం ప్రగతి సాధించింది. 4.23 లక్షల మంది కూలీలకు వేతనాల రూపంలో రూ.312.57 కోట్లు చెల్లింపులు చేసింది. 2025-26లో కోటి 30లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్ణయించుకుని రాబోయే మూడు నెలల్లో 90 లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయించారు.

పనులు వేగవంతం



జిల్లాలో ఉపాధి హామీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రహదారులు అభివృద్ధి చేస్తున్నాం. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానంచేసి ఉద్యాన రైతులకు చేయూతనిస్తున్నాం. కూలీలకు ఉపాధి కల్పనలో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించి జిల్లా అగ్రగామిగా నిలిచింది.

కె.వెంకటసుబ్బారావు, డ్వామా పీడీ

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా ఉద్యాన మొక్కల పెంపకాన్ని చేపట్టింది. జిల్లాలో 3,150 ఎకరాల్లో ఉద్యాన మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. దీంతో పాటు కమ్యూనల్ ప్లాంటేషన్‌లో భాగంగా 37.80 లక్షల మొక్కలను పెంచటానికి కలెక్టర్ ఆమోదంతో అటవీశాఖకు అందజేశారు.

ప్రగతివైపు పల్లె దారులు

ఏలూరు రూరల్: వైసీపీ పాలనలో గుంతలమయమైన గ్రామీణ రోడ్లకు ప్రస్తుతం మహర్దశ పట్టింది. ఏలూరు రూరల్ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న గుంతల రోడ్లను ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి. మాదేపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులతో రూ.17.50 లక్షలతో మాదేపల్లి జడ్పీ స్కూలు వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తి చేశారు. కాట్లంపూడిలో సీసీ రోడ్డు పూర్తవడంతో గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మృత్యువును గెలవలేక..

13 రోజులుగా చికిత్స పొందుతున్న ఫార్మాసిస్ట్ నాగాంజలి మృతి



ఒక్కగానొక్క కూతురు.. 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పుట్టిన బిడ్డ. పేద కుటుంబమైనా అపురూపంగా చూసుకుని.. ఉన్నత చదువు కోసం పట్టణం పంపించారు. అక్కడ మోసగాడి చేతికి చిక్కి విలవిల్లాడింది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 13 రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. తల్లిదండ్రులకు కుమార్తె మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది.

- రాజమహేంద్రవరం ఆస్పత్రి నుంచి భౌతిక కాయం స్వగ్రామానికి తరలింపు
- రౌతుగూడెంలో విషాదం.. • నిందితుడిని కఠినంగా శిక్షించాలన్న గ్రామస్థులు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, (ఇన్‌సెట్) నాగాంజలి (ఫైల్)


జీలుగుమిల్లి / రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఫార్మాసిస్ట్ నల్లపు నాగాంజలి శుక్రవారం మృతిచెందింది. 13 రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. ఆమె మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ప్రైవేట్ అంబులెన్సులో నాగాంజలి మృతదేహాన్ని స్వగ్రామమైన జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం తరలించారు. నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అత్యంత సున్నితమైన అంశం కావడంతో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చారు. నాగాంజలి తండ్రి దుర్గారావును పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా, మహిళా సంఘం నాయకులు ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకున్నారు.

తీరని విషాదం

రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్‌లో ఉన్న నాగాంజలి కొద్ది రోజుల్లో చదువు పూర్తి చేసుకుని తిరిగి వస్తుందనుకుంటే విగతజీవిగా రావడం రౌతుగూడెంలో తీవ్ర విషాదం నింపింది. వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడి ఫైనలియర్ చదువుతోంది. ఇంటర్న్‌షిప్ లో భాగంగా కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో 9 నెలలుగా ఫార్మాసిస్ట్‌గా పనిచేస్తుంది. బొల్లినేని ఆస్పత్రిలో మెడికల్ కోఆర్డినేటర్ దువ్వాడ మాధవరావు దీపక్ ఆమెను పెళ్లి చేసు కుంటానని నమ్మించి మోసం చేశాడు. మనస్తాపం చెందిన నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహం గ్రామంలోకి చేరగానే గ్రామస్థులు ఆందోళనకు దిగారు. నాగాంజలి కుటుంబానికి న్యాయం చెయ్యాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

నేతల పరామర్శ

నాగాంజలి తల్లిదండ్రులు నల్లపు దుర్గారావు, అనంతలక్ష్మిని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శ్యామలారాణి, మండల మహిళా సంఘాల నాయకులు ఎన్.నిర్మల, కె.దుర్గ, సీపీఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు సమీప గ్రామాల వారు పలువురు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వికాస్ కళాశాల ప్రిన్సిపాల్, రాచన్నగూడెం, ములగలంపల్లి, అశ్వారావుపేట, ఆసుపాక గ్రామాల వారు నాగాంజలి మృతదేహానికి నివాళులర్పించారు. రౌతుగూడెంలో అంవాఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ బి.వెంకటేశ్వరావు, సీఐ బి.వెంకటేశ్వరావు, ఎస్సైలు నవీన్‌కుమార్, విజయ్‌బాబు, మహేశ్వరావు శాంతిభద్రతలు పర్యవేక్షించారు.



పుట్టెడు దుఃఖంలో తండ్రి

ఆసుపత్రి వద్ద నాగాంజలి తండ్రి దుర్గారావు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. ఆయన పరిస్థితి చూసి అక్కడున్న వారు కన్నీటి పర్యంతమయ్యారు. కుమార్తెకు జరిగిన అన్యాయం, దిగులు ఎవరితో పంచుకోలేక, బాధ, ఆవేదన తనలోనే దిగమింగుకుని నిస్సహాయంగా ఆసుపత్రి ఆవరణలోని చెట్టుకింద దిగాలుగా కూర్చోవడం అందరినీ కలచివేసింది. కూతురి మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతుంటే దుర్గారావు మౌనంగా రోదిస్తూ ఒంటరిగా ఉండిపోయారు.

వాడిని కఠినంగా శిక్షించాలి..

మా పాపకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదు. వాడిని కఠినంగా శిక్షించాలి. ఇది మా కోరిక. ప్రభుత్వం తరపున సహకారం అందుతుంది. మా పాప పరిస్థితి ఎవరికీ రాకూడదంటే వాడిని కఠినంగా శిక్షించాల్సిందేనని దుర్గారావు అన్నారు.

అప్పుల భారంతో మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఒక మహిళ ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరులోని గొల్లాయిగూడానికి చెందిన పరసా మనీషా (46)కు భర్త మధుసూదనరావు, కుమారుడు చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. అప్పులు ఎక్కువ అయిపోవడంతో ఇల్లు కూడా అమ్మేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మనీషా గురువారం రాత్రి ఎలుకల మందు తినేసింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కడుపునొప్పి తాళలేక..

కామవరపుకోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పిని భరించలేక మహిళ చీరను మెడకు చుట్టుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కామవరపుకోట మండలం ఉప్పాలపాడులో చోటు చేసుకుంది. తడికలపూడి పోలీసుల కథనం ప్రకారం ఉప్పలపాడు గ్రామానికి చెందిన డోరేపల్లి సూర్యనారాయణ కుమార్తె గంగాభవానిని 15 ఏళ్ల క్రితం టి.నర్సాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన మేనమామ కాళ్నీడి ధనలక్ష్మీనారాయణతో వివాహం చేశారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గంగాభవాని కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఉప్పలపాడులో ఉన్న తన అన్నను చూడడానికి పిల్లలతో ఈనెల 2న వచ్చింది. అదేరోజు రాత్రి ఆమెకు కడుపునొప్పి వచ్చింది. 3న ఆమె తండ్రి పొలం, తల్లి వేరే ఊరు వెళ్లగా గంగాభవాని తన పిల్లలతో కలిసి ఇంటి వద్దనే ఉంది. ఆమెకు మళ్లీ విపరీతమైన కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లో మెడకు చీర చుట్టుకుని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గంగాభవాని మృతదేహానికి రెవెన్యూ అధికారులు శుక్రవారం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలో పడిన రైతు మృతదేహం లభ్యం



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం వద్ద ఎర్రకాలువలో పడి గల్లంతైన రైతు చల్లా బసవయ్య (70) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. లక్కవరం ఎస్సై శశాంక వివరాలు తెలిపారు. గురువారం సాయంత్రం పశువులను మేపడానికి వెళ్లిన బసవయ్య తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఎర్రకాలువ వద్ద అతడి వస్తువులు ఉండడంతో అనుమానంతో రాత్రంతా కాలువలో గజ ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ లేదు. శుక్రవారం ఉదయం బసవయ్య మృతదేహం కాలువలో పైకి తేలి ఉండడంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం

పాలకోడేరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ సీహెచ్.వెంకటేశ్వరరావు (37) ఆకస్మికంగా మృతి చెందారు. ఆకివీడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణంగా స్వగ్రామమైన శృంగవృక్షంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో బాత్‌రూమ్‌కు వెళ్లి ఎంతసేపటికి రాకపోవడంతో ఆయన భార్య వెళ్లి చూడగా స్పృహ తప్పి ఉన్నారు. దగ్గరలో ఉన్న ఆర్ ఎంపీ వైద్యుడిని పిలిపించి చూపించగా ఆయన మృతి చెందినట్లు తెలిపారు. తదనంతరం మృతుడి భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు శుక్రవారం పాలకోడేరు ఎస్ఐ మంతెన రవివర్మ అనుమానాస్పద మృతిగా నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నూజివీడులో వివిధ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో వివిధ షాపుల్లో నాణ్యమైన వస్తువులు ఉండడం లేదని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం నూజివీడు పట్టణంలో విజిలెన్సు, తూనికలు, కొలతల అధికారులు సంయుక్తంగా ఆయిల్స్, ఫ్లోర్ మిల్స్, చికెన్, చేపల షాపులు, కిరణా షాపులపై దాడులు నిర్వహించారు. శ్రీనివాసా ఫ్లోర్ అండ్ ఆయిల్ మిల్లు, పచారీ షాపు, తిరుమల లైవ్‌ఫిష్ షాపు, తిరుమల చికెన్ షాపు, శ్రీ శ్రీనివాసా ఫ్లోర్ మిల్లు (మర్రిబందం)లో తనిఖీలు చేశారు. ప్యాకింగ్ లైసెన్సు, సర్టిఫికెట్లు లేనివాటిని గుర్తించారు. కొన్ని దుకాణాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ కె.నాగరాజు, నూజివీడు తూనికలు కొలతల అధికారి వాసుదేవరావు వారి సిబ్బంది పాల్గొన్నారు.



షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

భీమడోలు బార్ అసోసియేషన్ కార్యవర్గం

భీమడోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎంపిక శుక్రవారం జరిగింది. అధ్యక్షురాలు గీతాంజలి, ఉపాధ్యక్షులు కె.మోహన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, కోశాధికారి విజయ్ అచ్యుతం, కార్యదర్శి లావేటి సుధారాణి, నారాయణ, రాణి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దోమలవ్యాప్తి నివారణకు అవగాహన ర్యాలీ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఏఎస్ కాలనీ అర్బన్ పీహెచ్‌సీ అరుంధతిపేట, కొబ్బరితోటలలో స్థానికులకు దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంటికి కనబడని దోమకాటువల్ల ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తిచెందుతాయని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ వివరించారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు వివరించారు.

సజావుగా టెన్త్ స్పాట్!

(ఐదో పేజీ తరువాయి)

సోషల్ జవాబు పత్రాల మూల్యాంకనానికి ఇంకా 14మంది ఏఈల కొరత ఏర్పడడంతో లోటును భర్తీ చేసేందుకు సమీప మండలాల నుంచి టీచర్లను రప్పించడానికి ఏర్పాట్లు చేశారు. స్పాట్ క్యాంపు నిర్వహణపై డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ జిల్లాకు మూల్యాంకనం నిమిత్తం రెగ్యులర్ విభాగంలో 1,82,803 జవాబు పత్రాలు, సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విభాగంలో 12,334 జవాబు పత్రాలు వచ్చాయని వివరించారు. వీటిని దిద్దడానికి అర్హులైన బోధనా సిబ్బందిని నియమించామన్నారు. శని, ఆదివారాల్లో ప్రభుత్వ సెలవుదినాలున్నప్పటికీ, అవి స్పాట్ క్యాంపునకు వర్తించబోవని స్పష్టం చేశారు. నిర్ణీత షెడ్యూలు ప్రకారం స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ ఈనెల 9నాటికి ముగించాల్సి ఉందని, ఈ వ్యవధిలో ఎటువంటి సెలవులు లేకుండా అన్ని రోజుల్లోను కొనసాగుతుందని వివరించారు.



ఊరేగింపులో వేషధారణలు.. భక్తులు

చల్లాలమ్మ ఊరేగింపు

ఉంగుటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ ఉగాది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం రాత్రి అమ్మవారిని పుర వీధుల్లో బాణసంచా గరగ నృత్యాలతో ఊరేగించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి గోదావరి జలాలతో జలాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సూరత్తుల శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. శుక్రవారం నాడు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని విద్యాశాఖ అధికార్లతో సమీక్ష నిర్వహించారు.

జాబ్ మేళాలో ఎనిమిది మంది ఎంపిక

ఉంగుటూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దివిస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో 22 మంది పేర్లు రిజిస్టర్ చేయించుకోగా ఎనిమిది మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు తెలిపారు. కెమిస్ట్రీ సబ్జెక్టులో డిగ్రీ,పి.జి.పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలో పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

అధికారులను అడ్డుకున్న అల్లంచర్లరాజుపాలెం గ్రామస్థులు



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

టి.నర్సాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అల్లంచర్లరాజుపాలెంలో సర్వే నంబరు 75లో సుమారు 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ సర్వే నెంబర్‌లో గతంలో విత్తనశుద్ధి క్షేత్రాన్ని ఏర్పాటు చేయడానికి వ్యవసాయ శాఖకు 40ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఆ భూమి ప్రస్తుతం ఆక్రమణలో ఉందని ఆభూమిని శుక్రవారం అధికారులు ఎక్సకవేటర్‌తో స్వాధీనం చేసుకోవడానికి పని ప్రారంభించగా స్థానికులు అడ్డుకున్నారు ఈ సందర్భంగా వారు అధికారులతో సర్వే నిర్వహించి తమ భూములు తమకు అప్పగించి మిగిలిన భూమిని తీసుకోవాలని కోరుతూ అధికారులను అడ్డుకున్నారు. చేసేదేమి లేక అధికారులు వెనుతిరిగారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నారాయణ



పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అంబుల వెంకట నారాయణ నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీకి ఎన్నో సేవలందించిన నారాయణను ఎమ్మెల్యే చంటి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ 2009వ సంవత్సరం నుంచి తెలుగుదేశం పార్టీకి ఎన్నో సేవలందిస్తున్నారని అన్నారు. దివంగత ఎమ్మెల్యే బడేటి బుజ్జి ఎమ్మెల్యేగా నామినేషన్ వేసే క్రమంలో నారాయణ న్యాయపరమైన ప్రక్రియ పూర్తి చేశారని అన్నారు. అలాగే తనకు కూడా ఎన్నో న్యాయపరమైన సలహాలు అందిస్తున్నారని అన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్ అన్నారు. శనివారపుపేటలో ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ బాలలకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బాలలతో మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో హోమ్ సూపరింటెండెంట్ శ్రీవల్లి, జిల్లా ప్రొబేషన్ అధికారి మోహనరావు, న్యాయవాదులు టి వెంకటేశ్వరరావు, భాస్కర్ పాల్గొన్నారు.

ఆటోలకు డార్జిలింగ్ ఎల్ఈడీ లైట్లు తొలగింపు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఆటోలకు అదనంగా బిగించిన డార్జిలింగ్ ఎల్ఈడీ లైట్ల వల్ల ఎదుటి వ్యక్తులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఈనేపథ్యంలో తక్షణం వాటి తొలగింపుకు ఆదేశాలు జారీ చేశామని జిల్లా ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రోడ్డు వద్ద రవాణాశాఖ అధికారులు పి. రమేష్‌బాబు, ఎన్.నెహ్రూ, పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞలు, తమ సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆటోలకు అమర్చిన 63 డార్జిలింగ్ లైట్లను తొలగించారు.

సారా అనర్థాలపై అవగాహన

బుట్టాయగూడెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సారా రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవోదయం 0.2 కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత పిలుపు నిచ్చారు. శుక్రవారం రాజానగరం పంచాయతీ పరిధిలోని ముద్దప్పగూడెం మరో మూడు గిరిజన గ్రామాల్లో సారా అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, అధికారులు ప్రభుకుమార్, అవులయ్య, అజయ్‌కుమార్‌సింగ్, పాల్గొన్నారు.

అక్రమంగా చెట్లు నరికివేత



ఏలూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి వృక్షాలుగా అభివృద్ధి చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఓ వైపు శ్రమిస్తున్నా కొందరి వల్ల శ్రమ బూడిదలో పన్నీరులా అవుతున్నది. స్థానిక శనివారపుపేట గవరవరంలోని శాతవాహన నగర్‌లో ప్రభుత్వ స్థలం ఉంది. స్థలం చుట్టూ అపార్టుమెంట్‌లు ఉన్నాయి. ఈక్రమంలో రెండు రోజులుగా కూలీలు చెట్లు నరకడం ప్రారంభించారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లను నరికివేశారు. కొందరు స్థానికులు అభ్యంతరం చెప్పినా పెడచెవిన పెట్టారు. వందేళ్ళ రావిచెట్టును సైతం నరికివేస్తుండడంతో విషయం తెలిసి విశ్వహిందూ పరిషత్ నాయకులు రామనపూడి శివ తదితరులు అడ్డుకున్నారు. శుక్రవారం కూలీలు చెట్లు నరికివేస్తుండడంతో ఇందుకు విద్యుత్ శాఖాధికారులు సైతం ఆ ప్రాంతంలో విద్యుత్ నిలుపుదల చేయడం విశేషం. చెట్లు నరికి సుమారు ఆరు ట్రాక్టర్లలో తరలించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తీరిగ్గా మునిసిపల్ శాఖాధికారులు రావడంతో కూలీలు అక్కడి నుంచి పరార్ అయ్యారు. దీనిపై చర్యలు తీసుకుంటామని మునిసిపల్ శాఖాధికారులు పేర్కొన్నారు.

కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలపై రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు కొనసాగిస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం అన్నేభవనంలో ఏర్పాటు చేసిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఈనెల 7వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం, న్యాయం కోసం ఎదురుచూస్తామని, అనంతరం లేనిపక్షంలో కోకో రైతుల పోరాటాన్ని ఉధృతం చేస్తామని కోకో రైతుల రాష్ట్ర సంఘ గౌరవ అధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు గొల్లు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి జాస్తి కాశిబాబు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలు ఎందుకు కొనుగోలు చేయడంలేదో ప్రభుత్వం తెలపాలన్నారు.

బడిఈడు పిల్లలకు స్పెషల్ డ్రైవ్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించే నిమిత్తం శుక్రవారం ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎం నాగులపల్లి ఎంపీయూపీ స్కూల్ రిటైర్డ్ హెచ్ఎం సీహెచ్‌వీ రమణారావు చొరవతో ఎంఈవో పరసా వెంకట్రావు, హెచ్ఎం ఎ. రమణ, ఉపాధ్యాయ బృందం గ్రామంలో ఇంటింటికి తిరిగి 28 మందిని బడిఈడు పిల్లలుగా గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులను ఒప్పించారు.

కోళ్ల వ్యర్థాలు పట్టివేత



లారీని అదుపులోకి తీసుకుని వ్యర్థాలను లారీలోకి ఎక్కిస్తున్న పోలీసులు

భీమడోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భీమడోలు శివారు లింగంపాడు ప్రాంతంలో 120 ఎకరాల చేపల చెరువును లీజుకు తీసుకున్న నాయకుడు సుమారు పది టన్నుల కోళ్ళ వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఈ వ్యర్థాలు హైదరాబాద్ నుంచి కోరం ప్రకాష్, కూచిపూడి వాసు అనే వ్యక్తులు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరి అరెస్టు చేసి కేసు నమోదు చేసి వ్యర్థాలను పాతిపెట్టి లారీని పోలీసులు సీజ్ చేశారు.

ఎస్‌డీసీ ఆర్డర్లపై పునఃసమీక్ష చేయాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కెఆర్‌పురం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌డీసీ ఆర్డర్లపై పునః సమీక్ష చేయాలని శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జగ్గిశెట్టిగూడెం గిరిజనులకు చెందిన భూముల విషయంలో గిరిజనేతరులకు అనుకూలంగా ఆర్డర్లు ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు కలుగజేసుకుని గిరిజనులకు న్యాయం చేయాలన్నారు.

నిడమర్రులో అభివృద్ధి పనులు ప్రారంభం

నిడమర్రు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, పత్తేపురం, పెదనింద్రకొలను గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు ముగ్గళ్లయాకోబు, రుద్రరాజు వెంకటేశ్వరరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

తాచుపాము పట్టివేత



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పేరంపేట గ్రామంలోని కలపాల నాగరాజు ఇంట్లోకి శుక్రవారం తాచుపాము ప్రవేశించింది. దీంతో ఇంట్లో వారంతా భయభ్రాంతులకు గురయ్యా రు. వెంటనే స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతికి సమాచారం అందించారు. క్రాంతి అక్కడకు చేరుకుని ఐదడుగులున్న తాచుపామును చాకచక్యంగా పట్టుకున్నాడు. పట్టిన పామును అడవిలో వదిలి పెడతానని క్రాంతి తెలిపారు.

రేషన్ బియ్యం ట్రక్కు ఆటో సీజ్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్సు తహసీల్దార్ వి.కన్యాకుమారి, విజిలెన్స్ ఎవో జి.మీరయ్య, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ షేక్ షకీర్ ఉన్నీసా, రెవెన్యూ అధికారులు కలిసి చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామానికి వెళ్లారు. అక్కడ ఆ గ్రామంలో ఉన్న పౌర సరఫరాల దుకాణం నెంబర్ 0509050, ఎండియు వాహనాన్ని తనిఖీ చేశారు. నిత్యావసర వస్తువులైన బియ్యం, పంచదార వ్యత్యాసాన్ని గుర్తించారు. అంతేకాకుండా అక్కడకు సంబంధించిన బియ్యం అక్రమ రవాణా జరుపుతున్న ఒక ట్రక్కు ఆటోను గుర్తించి ఆటోలోని 3.70 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆటో యజమాని రాణీమేకల సీతారామయ్య, రేషన్ డీలర్, ఎండియు ఆపరేటర్‌పై కేసులు నమోదు చేశారు.

ఎయిడ్స్ పరీక్షలపై సమీక్ష

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎయిడ్స్ రోగుల కోసం నిర్వహిస్తోన్న ఏఆర్‌టీ సెంటర్లు, ఐసీటీసీ కేంద్రాలు, లింక్ ఏఆర్‌టీ కేంద్రాలు, డీఎస్ఆర్‌సీ కేంద్రాలు, స్వచ్ఛందసంస్థల వైద్యులు, ప్రతినిధులతో శుక్రవారం జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి పరీక్షలసంఖ్యను పెంచాలని, ముఖ్యంగా గర్భిణీలకు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల భాగస్వాములకు నూరుశాతం వైరస్ పరీక్షలు జరగాలని ఆదేశించారు.

విధుల్లో చేరిన జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత సెలవుపై విదేశాలకు వెళ్ళిన జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆయన సతీమణి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి శుక్రవారం ఉదయం 9 గంటలకు విధుల్లో చేరారు. విదేశాల పర్యటన నేపథ్యంలో గత నెల 28వ తేదీన ఎస్పీ, జేసీ ఈనెల 3వ తేదీ వరకు ప్రభుత్వం నుంచి సెలవు తీసుకున్నారు. విదేశీ పర్యటన అనంతరం వారు తిరిగి శుక్రవారం యథావిధిగా విధులకు హాజరయ్యారు. ఇప్పటి వరకు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అదనపు బాధ్యతలు నిర్వహించారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

లింగపాలెం మండల సమావేశంలో సభ్యుల ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట లక్ష్మి

లింగపాలెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):లింగపాలెం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మునునూరి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ మం డలంలో ఆయా శాఖల ద్వారా జరు గుతున్న అభివృద్ధి పనుల గురించి వివ రించారు. వైస్ ఎంపీపీ మట్టాసురేష్ అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదని ప్రజా ప్రతినిధులకు సమాచార మందించడం లేదంటూ మండిపడ్డారు. దీంతో ఎంపీడీవో వాణి కలుగజేసుకుని అధికారు లు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ప్రజాప్రతినిధులకు తెలియ జెయ్యాలని సూచించారు. ఈ సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు డుమ్మాకొట్టారు.

ముప్పవరంలో భూ రీ సర్వేపై అవగాహన



ముప్పవరంలో భూ రీసర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించే రెండవ విడత భూ రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ బత్తుల సుమతి అన్నారు. శుక్రవారం ముప్పవరం గ్రామ పంచాయతీ పరిధిలో డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర రెవె న్యూ అధికారులు సర్వేయర్‌తో పాటు గ్రామ సర్పంచ్ డాక్టర్ ఎం.సంతోష్ కుమార్ భూ రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అందరూ కలిసి భూ రీసర్వేపై ర్యాలీ నిర్వహించారు.

బుట్టాయగూడెం: చింతలగూడెం, కొవ్వాడ గ్రామాల్లో భూముల రీ సర్వే కోసం అవగాహన సదస్సులు నిర్వహించారు. రిసర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గ్రామ సరిహద్దులను రీ సర్వే చేశారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఆందోళన



బుట్టాయగూడెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, కరెంట్ బిల్లులను తగ్గించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుట్టాయగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గిరిజనులు ధర్నా చేశారు. మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ అదనపు చార్జీ ల పేరుతో పేదలపై భారాలు మోప వద్దని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను బిగించవద్దని అన్నారు. అనంతరం ఏఈ శ్రీనివాసవర్మకు వినతి పత్రాన్ని అందజేశారు.

కారం మిల్లులో ఉత్పత్తి ప్రారంభించాలి



బుట్టాయగూడెంలో కారం యూనిట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీవో కె.రాములు నాయక్

బుట్టాయగూడెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన కారం మిల్లులో ఉత్పత్తిని త్వరగా ప్రారంభించాలని కెఆర్‌పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ శుక్రవారం జీసీసీ మేనేజర్ రాజయోగిని ఆదేశించారు. కారం యూనిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి చాలా కాలం అవుతుందని ఉత్పత్తికి ఆటంకాలు ఏమిటని ప్రశ్నించారు. చేయవలసిన పనులు ఏమైనా ఉంటే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. జీసీసీ ఉత్పత్తులంటే ప్రజల్లో ఎంతో నమ్మకం ఉందని అధికారులతో మాట్లాడి అడ్డంకులను అధికమించాలని సూచించారు. అంతకముందు కామయ్యపాలెం, జిల్లేళ్ళగూడెంలో విడివిడెలలో కారం, చింతపండు ప్రాసెసింగ్ యూనిట్లను పీవో పరిశీలించారు. జీపీఎస్ స్కూలును సందర్శించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ



కొణికిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : లోఓల్టేజీ సమస్యలను తొలగించి గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొణికి గ్రామంలో రూ.మూడు కోట్ల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సర్పంచ్ పొట్లూరి యుగంధర్‌తో కలిసి భూమిపూజా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం వీరమ్మకుంటలో మీకోసం మీ చింతమనేని కార్యక్రమంలో పాల్గొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గారపాటి రామసీత, ఉప్పలపాటి రాంప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, శ్రావణి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెదవేగి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన 24గంటల్లోనే రైతుల ఖాతాలో సొమ్ము జమ చేస్తామని, ఈ విషయంలో ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందన్నారు. వ్యవసాయశాఖ ఉపసంచాలకుడు హబీబ్ బాషా, వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు వై.సుబ్బారావు, మండల రెవెన్యూ అధికారి భ్రమరాంబ పాల్గొన్నారు.

దెందులూరు: సీతంపేట సహకార సంఘం బ్యాంకు కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బత్తుల సుమతి, వ్యవసాయ శాఖ అధికారి దామ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మాజీ సహకార బ్యాంకు అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ ప్రాంతం పరిశీలన



బ్రిడ్జి వద్ద నిర్మాణ పనుల గురించి చర్చిస్తున్న అధికారులు

భీమడోలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. అయితే పనులు కొనసాగుతుండగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులు లేవంటూ బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపివేయాలంటూ ఆదేశించింది. దీనిపై స్థానిక ప్రజలు, నాయకులు సమస్యను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లడంతో పార్లమెంటు సమావేశాల సమయంలో ఢిల్లీలో ఉన్న ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి అనుమతులు తెచ్చారు. ఈ మేరకు శుక్రవారం అధికారులు పర్యటించి వంతెన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.

నవమి ఏర్పాట్లు ప్రారంభం

చింతలపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వెలమపేట సెంటర్‌లోని కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం మహిళా భక్తులు సీతారాముల విగ్రహాలకు పూజలు జరిపి వివాహాన్ని సంప్రదాయబద్ధంగా చేయాలని పెళ్లి పనులు ప్రారంభిస్తున్నట్టుగా పసుపు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి పూజలు జరిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

చింతలపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభు త్వ ఇంటర్ విద్యార్థినులకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ముందు చూపుతో సెలవుల్లో ఇంటర్ విద్యార్థులకు సమ యం వృథా కాకుండా వచ్చే విద్యా సంవత్సరం ముందే ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ముందుగా అందించాలని కళాశాల లకు పంపారు.

చింతలపూడి అభివృద్ధికి సహకరించండి

చింతలపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండల సీపీఐ 13వ మహాసభలు ముగిశాయి. సభలో చింతలపూడి అభివృద్ధికి సహకరించాలంటూ పలు తీర్మానాలు చేసినట్టు మండల కార్యదర్శి టి.బాబు తెలిపారు. ఈ ప్రాంతంలో బొగ్గు నిల్వలు వెలికి తీయాలని, చింతలపూడి-ఏలూరు, పాతిమాపురం- ద్వారకా తిరుమల నాలుగులైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని, వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించాలని, ప్రజల కోరిక మేరకు ఆర్టీసి డిపో చింతల పూడిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు.

ఏరియా ఆసుపత్రిలో చలివేంద్రం

చింతలపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రి ఆవరణలో చలివేంద్రాన్ని నగర పంచాయతీ కమిషనర్ డి.పావని శుక్రవారం ప్రారంభించారు. మానవత సభ్యులు ఎ.అప్పారావు, పి.సోమశేఖర్, టి. నాగ విజయకుమార్, పాల్గొన్నారు.

అందరికి సభ్యత్వ కార్డులు అందించాలి

చింతలపూడి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి సభ్యత్వం చేసుకున్న ప్రతి సభ్యునికి కార్డు అందేలా బూత్ ఇన్‌చార్జ్‌లు చొరవ చూపాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి చింతలపూడి నియోజకవర్గానికి సంబంధించి పార్టీ సభ్యత్వ కార్డులు రావడంతో శుక్రవారం రాత్రి బూత్ ఇన్‌చార్జ్‌లకు, మండల గ్రామ పార్టీ ఇన్‌చార్జ్‌లకు ఈ కార్డులు ఆయన అందచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ జె.ముత్తారెడ్డి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

కుక్కునూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): భద్రా చలంలో జరిగే శ్రీరామనవమి కల్యాణ మహో త్సవం తిలకించడానికి వేలాది మంది భక్తులు కుక్కునూరు మీదుగా పాదయాత్ర చేస్తూ తరలి వెళ్తున్నారు. ఈ క్రమంలో వారికి కుక్కునూరుకు చెందిన వీ.శంకుబాబు అనే భక్తుడు అన్నప్రసాదాలు అందజేస్తున్నారు. అన్నసమా రాధనకు తన వంతు సాయంగా తెలంగాణలోని బూర్గంపాడు, అశ్వారావుపేట నియోజక వర్గాల మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని శంకుబాబుకు అందజేశారు

విద్య, చట్టాలు, హక్కులపై అవగాహన

పెదపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి బాలల రక్షణ కమిటీ ఆధ్వర్యంలో కలపర్రులోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు, విద్య ప్రాము ఖ్యత, చట్టాలు, హక్కులు, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ యూని ట్ కార్యాలయ కౌన్సిలర్ యు.బాలస్వామి, ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి పాల్గొన్నారు.

సీఆర్ఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

పెదపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగే అంతర్జాతీయ సాంకేతిక పోస్టర్‌ను కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లి కార్జునుడు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వ రరావు ఆవిష్కరించారు. ఈ సదస్సులో బయో మెడికల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ తదితర సాంకేతిక నైపుణ్యత కలిగిన విభాగాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు, ఉపయోగాలు, ఆధునిక అంశాలకు సంబంధించి అంతర్జాతీయంగా విద్యార్థులు పాల్గొంటార న్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

ఏలూరురూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.పి.ఆర్.విఠల్‌కుమార్ కోరారు. ఈనెల 11వ తేదీన సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

సజావుగా టెన్త్ స్పాట్!

(ఐదో పేజీ తరువాయి)

సోషల్ జవాబు పత్రాల మూల్యాంకనానికి ఇంకా 14మంది ఏఈల కొరత ఏర్పడడంతో లోటును భర్తీ చేసేందుకు సమీప మండలాల నుంచి టీచర్లను రప్పించడానికి ఏర్పాట్లు చేశారు. స్పాట్ క్యాంపు నిర్వహణపై డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ జిల్లాకు మూల్యాంకనం నిమిత్తం రెగ్యులర్ విభాగంలో 1,82,803 జవాబు పత్రాలు, సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య విభాగంలో 12,334 జవాబు పత్రాలు వచ్చాయని వివరించారు. వీటిని దిద్దడానికి అర్హులైన బోధనా సిబ్బందిని నియమించామన్నారు. శని, ఆదివారాల్లో ప్రభుత్వ సెలవు దినాలున్నప్పటికీ, అవి స్పాట్ క్యాంపునకు వర్తించబోవని స్పష్టం చేశారు. నిర్ణీత షెడ్యూలు ప్రకారం స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ ఈనెల 9నాటికి ముగించాల్సి ఉందని, ఈ వ్యవధిలో ఎటువంటి సెలవులు లేకుండా అన్ని రోజుల్లోను కొనసాగుతుందని వివరించారు.



వనామీ రొయ్యలను పట్టుబడి చేస్తున్న రైతులు

వనామీపై ట్రంప్ సుంకాల ప్రభావం

రూ.30 ధర పతనం

ఐదు రోజులు పట్టుబడులు వద్దంటున్న కంపెనీలు

ఆందోళనలో ఆక్వా రైతులు

కైకలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాలు పెంచడంతో దాని ప్రభావం ఇక్కడ ఆక్వా రంగంపైనా తీవ్రంగా పడింది. అమెరికా దిగుమతి చేసుకునే అన్ని రకాల ఉత్పత్తులపై 27 శాతం పన్నులు పెంచడంతో ఆక్వా రంగం దెబ్బతింది. దీంతో రైతులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా ప్రాన్స్‌ఫార్మర్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు మరో ఐదు రోజుల పాటు రైతులు ఎక్కడా రొయ్యల పట్టుబడులు చేయవద్దని వైరస్ సోకితేనే పట్టుబడి చేసేందుకు ముందుకు వెళ్లాలని సూచించారు. 100 కౌంటు ధర రెండు రోజులు క్రితం రూ.250 ఉంటే శుక్రవారం మార్కెట్ ధర రూ.220కు కొనుగోలు చేస్తున్నారు. రూ.30 వరకు పతనమైంది. ప్రపంచంలో అన్ని దేశాలకంటే భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే మెరైన్ ఉత్పత్తులే తక్కువ ధరకు అమెరికాకు రవాణా అవుతున్నాయి. భారత్‌పై కూడా భారీగా ట్యాక్సు పెంచడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 2.50 లక్షల ఎకరాల్లో రైతులు రొయ్యలను సాగు చేస్తున్నారు.

అమెరికాకు ప్రతీ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ నుంచి 17.2 లక్షల టన్నులు వనామీ రొయ్యలు ఎగుమతి అవుతుంటాయి. ఇప్పటికే పట్టుబడులు నిలిపివేయడంతో ఆక్వా కూలీలకు ఉపాధి కరువయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. పట్టుబడులు నిలిపివేయడం వలన రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి ఆక్వా ఉత్పత్తులపై ఇరు దేశాలు చర్చలు జరిపి సుంకాలు తగ్గించేలాగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నూజివీడులో వివిధ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో వివిధ షాపుల్లో నాణ్యమైన వస్తువులు ఉండడం లేదని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి శ్రీరాంబాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం నూజివీడు పట్టణంలో విజిలెన్సు, తూనికలు, కొలతల అధికారులు సంయుక్తంగా ఆయిల్స్, ఫ్లోర్ మిల్స్, చికెన్, చేపల షాపులు, కిరణా షాపులపై దాడులు నిర్వహించారు. శ్రీనివాసా ఫ్లోర్ అండ్ ఆయిల్ మిల్లు, పచారీ షాపు, తిరుమల లైవ్‌ఫిష్ షాపు, తిరుమల చికెన్ షాపు, శ్రీ శ్రీనివాసా ఫ్లోర్ మిల్లు (మర్రిబంధం)లో తనిఖీలు చేశారు. ప్యాకింగ్ లైసెన్సు, సర్టిఫికెట్లు లేనివాటిని గుర్తించారు. కొన్ని దుకాణాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ కె.నాగరాజు, నూజివీడు తూనికలు కొలతల అధికారి వాసుదేవరావు వారి సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో సమస్యలు పరిష్కారం : తహసీల్దార్

కైకలూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రీసర్వే ద్వారా సమస్యల పరిష్కరించుకునేందుకు రైతులకు అవకాశం కలుగుతుందని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. రెండోవిడత రీసర్వే పైలట్ గ్రామంగా ఎంపికైన ఆటపాకలో గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వేలో తప్పులు ఉంటే పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వ హించారు. ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, సర్వేయర్ రమేష్, వీఆర్వో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

కైకలూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):భూమి సారవంతంగా మారి పంట దిగుబడి పెరిగేందుకు పచ్చిరొట్ట పైర్లు పెంచడం అవసరమని ఏడీఏ గంగాధరరావు అన్నారు. శుక్రవారం కైకలూరు మండలం వేమవరప్పాడులో రైతుసేవా కేంద్రం వద్ద నవధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాల కిట్లను వ్యవ సాయశాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ మొదటి విడతగా 300 విత్తనాల కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కైకలూరు, కలిదిండి వ్యవసాయాధికారులు ఆర్.దివ్య, విద్యాసాగర్, కూటమి నేతలు బోయిన గోవర్ధన్, నున్న కొండ, నీటిసంఘాల అధ్యక్షుడు బోడావుల వసంతరావు, బోడావుల రవీంద్రరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ జూనియర్ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో త్రివిధ జూనియర్ కాలేజీ నూతనంగా ప్రారంభించామని, శుక్రవారం నుంచి ప్రవేశాలు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నూజివీడు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే తమ లక్ష్యమన్నారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తామన్నారు. ఇంటర్లో 2025-26 విద్యా సంవత్సరం ఎంపీసీ గ్రూపు మాత్రమే ప్రారంభిస్తున్నామన్నారు. ఒక్కక్క సెక్షన్‌కు 40 మంది విద్యార్థులతో రెండు సెక్షన్లను ప్రారంభిస్తున్నామన్నారు. సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యార్థులకు బోధిస్తామన్నారు. కెమిస్ట్రీ లెక్చరర్ నౌడు నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు థర్డ్ జోన్‌కు సాగునీరు

సరఫరాను పరిశీలించిన నీటి సంఘాల ప్రతినిధులు



నీటి విడుదలను పరిశీలిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు

నూజివీడు ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):సాగర్ ఎడమ కాలువ పరిధిలోని థర్డ్ జోన్ టాలెంట్ ప్రాంతానికి ఎట్టకేలకు సాగునీరు అందించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు థర్డ్ జోన్ పరిధిలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగు తాగునీరు అందరి పరిస్థితిపై ఆంధ్రజ్యోతి 'సాగర ఘోష' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన నేపథ్యంలో నూజివీడు, గన్నవరం, తిరువూరు, మైలవరం ఎమ్మెల్యేలతోపాటు సాగర్ అధికారులు అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఎడమ కాలువ థర్డ్‌జోన్ పరిధిలోని కాలువలకు సాగునీటిని విడుదల చేయగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు నీటి విడుదల పరిశీలించారు. ఆళ్ళ గోపాలకృష్ణ మాట్లాడుతూ 117వ కిలోమీటర్ వద్ద 1126 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందన్నారు. ప్రస్తుతం నూజివీడు బ్రాంచ్‌కు 600 క్యూసెక్కులు ఇస్తున్నట్లు క్రమంగా 700 క్యూసెక్కులకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ముదినేపల్లి తహసీల్దార్ బదిలీ

ముదినేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):మండల తహసీల్దార్ జెఎస్ సుభానీ బదిలీ అయ్యారు. ఆయన్ని ఏపీ సచివాలయంలోని ల్యాండ్ రెవెన్యూ విభాగంలో నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ పవన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సుభానీని కార్యాలయ అధికారులు, సిబ్బంది, వీఆర్వోల సంఘం, వీఆర్ఏల సంఘ సభ్యులు సన్మానించారు.

మూడేళ్లు గడిచాయ్.. బస్ ఏది?

జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు మండల ప్రజలు ఆగచాట్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):కొత్త జిల్లాలు ఏర్పడి మూడేళ్లునిండాయి. పార్లమెంట్ నియోజకవర్గం ప్రాతిపదికన ఏర్పడిన కొత్త జిల్లాల్లో ఇతర జిల్లా నుంచి కొత్తగా కలసిన అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలకు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రజా రవాణా సౌకర్యాన్ని నేటికీ కల్పించలేదు. మూడేళ్లుగా ఆర్టీసీ అధికారులు జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి బస్ సౌకర్యం కల్పించేందుకు కనీసం ఒక రూట్ ప్లాన్‌ను కూడా రూపొందించలేకపోయారు. ముదినేపల్లి మండలానికి చెందిన ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ మండలం ఏలూరు జిల్లాకు శివారున ఉంది. గతంలో కృష్ణా జిల్లాలో ఉన్న సమయంలో జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వెళ్లేందుకు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్ సౌకర్యం అందుబాటులో ఉండేది. ఏలూరు జిల్లాలో కలిపాక ఒక్క గ్రామానికి కూడా జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు ముదినేపల్లి చేరుకుని అక్కడి నుంచి కైకలూరు మీదుగా, కొన్ని గ్రామాల ప్రజలు గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏలూరు నుంచి కైకలూరు మీదుగా ముదినేపల్లి, కైకలూరు, కోరుకొల్లు మీదుగా సింగరాయపాలెం వరకు రెండు బస్ సర్వీసులు ఏర్పాటు చేస్తే ముదినేపల్లి, మండవల్లి, కలిదిండి మండలాల ప్రజలకు జిల్లా కేంద్రానికి సునాయాసంగా వెళ్లే అవకాశం కలుగుతుంది.

బస్ లేక అగచాట్లు



ముదినేపల్లి నుంచి జిల్లా కేంద్రమైన ఏలూరు వెళ్లేందుకు సరాసరి ఆర్టీసీ బస్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు మారుతూ వివిధ గ్రామాల ప్రజలు ఏలూరు చేరుకోవడం కష్టంగా ఉంది. ఆర్టీసీ అధికారులు ఏలూరు నుంచి ముదినేపల్లి బస్ ఏర్పాటు చేయాలి.

- వత్తుమిల్లి ప్రసాద్, మానవహక్కుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ముదినేపల్లి

ఆధ్యాత్మికం



తాడినాడ సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా సీతారామస్వామి కల్యాణోత్సవాలు

కలిదిండి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):తాడినాడలో సీతారామస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అర్చకులు కందాడ శ్రీమన్నారాయణ, చక్రవర్తి ఆచార్యులు సుప్రభాత సేవ, నిత్యార్చన, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఆదివారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవాల కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఈవో శేఖర్ తెలిపారు.

కోదండరాముడి తిరు కల్యాణోత్సవాలు ప్రారంభం



సింగరాయపాలెంలో కోదండరామస్వామిని పెండ్లి కుమారుడిని చేసి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ముదినేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెంలోని బావాజీ మఠంలో ఉన్న కోదండ రామస్వామి తిరు కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేసి అర్చకులు ఆచూరి రంగనాథాచార్యులు పూజలు నిర్వహించారు. దేవస్థానంలో విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేణ పూజ జరిపిన అనంతరం పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో పీవై నాయుడు పర్యవేక్షణలో నవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ముదినేపల్లి పెదరామాలయం, పెదగొన్నూరు, విశ్వనాద్రిపాలెం, ఉప్పరగూడెం, బొమ్మినంపాడు, పెదపాలపర్రు, ప్రొద్దువాక రామాలయాల్లో శ్రీరామనవమికి ఏర్పాట్లు చేస్తున్నారు.

విజయ దుర్గాదేవికి పూజలు



ముదినేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దేవపూడిలో హిమగిరి రామలింగేశ్వరస్వామి వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఉన్న విజయ దుర్గాదేవికి శుక్రవారం విశేష అలంకరణ చేసి భక్తులు పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు జరిపి అభిషేకాలు నిర్వహించారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి : ఎంపీపీ

మండవల్లి ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):వేసవి పురస్కరించుకుని గ్రామాల్లో అధికారులు నాయకులు సమన్వయంతో పనిచేసి నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో చెరువులు అడుగంటాయని త్వరలో ప్రభుత్వం నీటిని విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. ఎన్ఆర్‌జీఎస్ పనులు గ్రామాల్లో చేస్తున్న సర్పంచ్‌లకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని పలువురు సర్పంచ్‌లు వాపోయారు. జడ్పీటీసీ విజయనిర్మల, వైస్ ఎంపీపీలు ఆదివిష్ణు, చారిగడ్డి సుధారాణి, ఎంపీడీవో రామలింగేశ్వరరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రికి ప్రత్యేక బస్సులు

ముదినేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం వెళ్లే భక్తులకు శనివారం రాత్రి గుడివాడ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో అధికార్లు తెలిపారు. ముందుగా రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఎక్కడైనా ఎక్కువ మంది ప్రయాణికులు ఉంటే ఆయా ప్రదేశాలకు ప్రత్యేక బస్సులను పంపుతామని పేర్కొన్నారు.

ఫార్మసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా జాన్ బాబు



ముదినేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా ఫార్మసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా ముదినేపల్లికి చెందిన ఫార్మసిస్టు పట్టెం జాన్‌బాబు ఎన్నికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో జాన్‌బాబును జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని, ఫార్మా-డి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు, పీహెచ్‌సీ, సీహెచ్‌సిల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్టుల పోస్టుల భర్తీకి కృషి చేస్తానని జాన్‌బాబు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ముదినేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని పరిరక్షించడంతో పాటు, ఆరోగ్య వంతమైన ఆహార ఉత్పత్తులను సాధించాలని వ్యవసాయశాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం ముదినేపల్లి మండల ఇన్‌చార్జి గౌతం కుమార్ తెలిపారు. శుక్రవారం బొమ్మినపాడులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వాడకం, పచ్చిరొట్ట పెంపకం చేపట్టాలని కోరారు. మండవల్లి మండల ఇన్‌చార్జి నాగవిజయ, పాఠశాల హెచ్ఎం బేతాళరావు, వీవోఏ పావని, ఐసీఆర్‌పీలు అనూష, సుధాకర్, నళిని, జగన్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.



వైవాకలో జరుగుతున్న బుసక తవ్వకాలు

బుసక తవ్వకాలకు బ్రేక్

ముదినేపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైవాక గ్రామ దళితవాడకు సమీపంలో జరుగుతున్న బుసక తవ్వకాలను రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. అనుమతులు లేకుండా పొలాల్లో బుసకను తవ్వి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తూ కొంత మంది సొమ్ము చేసుకుంటున్న నేపథ్యంలో గ్రామస్థుల నుంచి వస్తున్న అభ్యంతరాలతో మండల రెవెన్యూ అధికారులు స్పందించి బుసక తవ్వకాలను శుక్రవారం నిలిపివేశారు. అనుమతులు లేకున్నా జరుగుతున్న బుసక రవాణాను వీఆర్వో నాగరాజు అడ్డుకున్నారు.



ఎనర్జీ ఇంజనీరింగ్‌పై అవగాహన కల్పిస్తున్న పవర్ గ్రిడ్ జీఎం నాగమోహనరావు

పవర్ విజన్ - 2050 పై అవగాహన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో ఎదురవుతున్న సవాళ్ళు సమస్యలకు పవర్ ఎనర్జీ ద్వారా పరిష్కారం లభిస్తుందని నున్న పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ నాగమోహనరావు అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పవర్ విజన్ 2050పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ రంగంలో పవర్ విజన్ 2050 అనే అంశంపై కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడకుండా శక్తి వినియోగాన్ని పెంచడం విద్యుత్ వాహనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ శ్రావణి, కోఆర్డినేటర్ బి.జ్యోతిలాల్ నాయక్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెంటర్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎమ్మార్ ఏఆర్ కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్‌లో ఏపీ పీజీ సెట్ హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జైనవీన లావణ్య లతా తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ ఎంట్రన్స్ టెస్ట్‌కు సంబంధించి హెల్ప్‌డెస్క్‌ను సోమవారం నుంచి ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఏపీ పీజీ సెట్‌కు దరఖాస్తు చేయడానికి ఈనెల 30 వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు మాత్రమే పీజీ సెంటర్లో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉంటుందని, వివరాలకు పీజీ సెంటర్లో సంప్రదించాలని ఆమె తెలిపారు.



బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

లోపూడి మీదుగా హైదరాబాద్‌కు బస్సు సర్వీస్

మునునూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నూజివీడు నుంచి ముసునూరు మండలం రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లితో పాటు లోపూడి మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను గురువారం రాత్రి ప్రారంభించారు. లోపూడిలో మంత్రి పార్థసారథి చిత్రపటానికి స్థానికులు, నాయకులు పాలాభిషేకం చేశారు. ఆయా గ్రామాల ప్రజలు సుమారు 12 కిలోమీటర్లు వెళ్లి హైదరాబాద్ బస్సు కోసం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను మంత్రి కొలుసు దృష్టికి తీసుకువెళ్లగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు నాయకులు చెప్పారు. తొలుత బస్సుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్కపాము కాంతరావు, చలమాల వెంకటేశ్వరరావు, నక్క చెన్నారావు, శెట్టిపల్లి నూతనబాబు, పంజుగల వెంకయ్య, తాళం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బస్సు సర్వీసుల ప్రారంభం

నూజివీడు టౌన్ : ధార్మిక క్షేత్రాలకు ఆర్టీసీ నూతన సర్వీసులను ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. నూజివీడు ఆర్టీసీ డిపోలో తిరుపతికి రెండు సూపర్ లగ్జరీ సర్వీస్‌లను శుక్రవారం ప్రారంభించారు. సూపర్ లగ్జరీ బస్సు నూజివీడు నుంచి రాత్రి 7:30 గంటలకు బయలుదేరుతుందని, మరుసటిరోజు సాయంత్రం తిరుపతిలో 6:10 బయలుదేరుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, డిపో అసిస్టెంట్ మేనేజర్ జి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులకు సంఘీభావం



హెచ్‌సీయూ విద్యార్థులకు మద్దతుగా ఐసా విద్యార్థుల నిరసన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వారం రోజులుగా విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా ఐసా ఆధ్వర్యంలో కృష్ణా యూనివర్సిటీ పీజీ సెంటర్లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఐసా జిల్లా కార్యదర్శి అఖిల్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీ భూమిని అక్రమంగా కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూడడం దారుణం అన్నారు. గణేష్, రాజేశ్వరి, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

కైకలూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో రామారావు అన్నారు. శుక్రవారం కైకలూరు ఎంఈవో కార్యాలయం వద్ద నూతన విద్యా సంవత్సరానికి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ నాయకులు శ్యామ్‌సుందర్, అక్బర్ హుస్సేన్, వడ్డీ శ్రీనివాసరావు, కె.భోగేశ్వరరావు, జకావుల్లా, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



తహసీల్దార్ ఎదుట హాజరైన ఎక్సైజ్ పాత నిందితులు

12 మంది ఎక్సైజ్ నిందితుల బైండోవర్

చాట్రాయి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):మండలంలో పలు గ్రామాలకు చెందిన 12 మంది పాత నిందితులను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ గీత ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ కాల పరిమితి ఏడాది ఉంటుందని, మళ్లీ నేరాలు చేసి పట్టుబడితే రూ లక్ష జరిమానా, సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని నిందితులను తహసీల్దార్ గీత హెచ్చరించారు.

బైండోవర్ ఉల్లంఘనతో రూ.10 వేలు జరిమానా

ముసునూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన వ్యక్తిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినా తిరిగి నేరం చేయడంతో రూ.10 వేలు జరిమానా విధించారు. ముసునూరుకు చెందిన చెంగల నాగేంద్రరరావు సారా విక్రయాలు చేస్తుండగా ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య, సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. తహసీల్దార్ వద్ద హాజరుపరచగా రూ.10వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ముసునూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):పామాయిల్ తోటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాలివి.. చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన పింగుల ఏసుబాబు(48) ముసునూరు మండలం గుడిపాడుకు చెందిన రైతు నక్కరగంటి నవీన్ వద్ద పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం పశువులకు మొక్కజొన్న చొప్ప కోసుకువచ్చేందుకు వెళ్లాడు. ఏసుబాబు యజమాని ఇంటికి రాకపోవడంతో శుక్రవారం ఉదయం నవీన్‌తోపాటు చుట్టుపక్కల వెతుకులాడుతుండగా పామాయిల్ తోటలో విగతజీవిగా పడి ఉండడం గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీ లించి నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమో దు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	145, 154, 165
చికెన్ విత్ స్కిన్	280
చికెన్ స్కిన్‌లెస్	390

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475